జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం
తెలంగాణ రాష్ట్రంలో పలు విభాగాల్లో పనిచేయుటకు
జిల్లా స్టాఫర్లు
నియోజకవర్గ ఇన్‌ఛార్జీలు
మండల రిపోర్టర్లు
ఆసక్తి, అనుభవం గల వారు సంప్రదించగలరు
సంప్రదించండి
77801 85674

RNI NO.TGTEL/25/A5224
# జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం

జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం
తెలంగాణ రాష్ట్రంలో పలు విభాగాల్లో పనిచేయుటకు
జిల్లా స్టాఫర్లు
నియోజకవర్గ ఇన్‌ఛార్జీలు
మండల రిపోర్టర్లు
ఆసక్తి, అనుభవం గల వారు సంప్రదించగలరు
సంప్రదించండి
77801 85674

కరీంనగర్ సంపుటి : 01 సంచిక : 243 సోమవారం, సెప్టెంబర్ 21 2026 , పేజీలు - 8 వెల : 2/- epaper.jordar.com

## డిగ్రీ కాలేజీల నిర్వహణపై ప్రశ్నల వర్షం..
# ప్రభుత్వ బాధ్యత ఏంటి?

- ●ప్రిన్సిపాళ్ల నియామకం నుంచి యూజీసీ నిబంధనల వరకు పలు అంశాలపై క్యూజీడీఎల్ఏ ప్రశ్నలు
- ●అర్హులైన 1998 జూనియర్ లెక్చరర్లకు న్యాయం చేయాలని డిమాండ్.. ప్రత్యేక డీపీసీ నిర్వహించాలని విజ్ఞప్తి




**హైదరాబాద్ జోర్దార్ ప్రతినిధి:**
రాష్ట్రంలోని డిగ్రీ కాలేజీల నిర్వహణ, ప్రిన్సిపాళ్ల నియామకాలు, ఉద్యోగుల అర్హతలు, ప్రమోషన్లు, యూజీసీ నిబంధనల అమలుపై క్వాలిఫైడ్ డిగ్రీ లెక్చరర్స్ అసోసియేషన్ (క్యూజీడీఎల్ఏ) పలు ప్రశ్నలు లేవనెత్తింది. కాలేజీల్లో ప్రిన్సిపాళు లేకుండానే పరిపాలన కొనసాగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించింది. ఒకే ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో మూడు, నాలుగు కాలేజీలను నిర్వహించాల్సిన పరిస్థితి ఎందుకు ఏర్పడిందో ప్రభుత్వం స్పష్టం చేయాలని కోరింది. కమిషనరేట్‌లో పనిచేస్తున్న అధికారులు నిబంధనలకు అనుగుణంగా నిబద్ధతతో విధులు నిర్వహిస్తున్నారా? లేక నిర్ణయాల్లో అక్రమాలకు అవకాశం కల్పిస్తున్నారా? అనే అంశంపై ప్రభుత్వం సమగ్రంగా పరిశీలించాలని సంఘం విజ్ఞప్తి చేసింది. ఉద్యోగుల విద్యార్హతలకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని, ఉన్నత విద్యార్హతలు కలిగి ఉండటం శాపంగా మారే పరిస్థితి ఎందుకు ఏర్పడిందని ప్రశ్నించింది.

**యూజీసీ నిబంధనలు పాటించారా?**
1990 నుంచి 2026 వరకు తీసుకున్న నిర్ణయాలు యూజీసీ నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా లేదా అనే విషయాన్ని ప్రభుత్వం సమీక్షించాలని క్యూజీడీఎల్ఏ కోరింది. యూజీసీ నిబంధనలను పాటించకుండా 1990 నుంచి 2010 వరకు యూజీసీ నిధులను ఎలా వినియోగించారో, అర్హత లేని వారికి నిధులు అందించారా అనే అంశాలపై సమగ్ర విచారణ, ఆడిట్ నిర్వహించాలని డిమాండ్ చేసింది. అదేవిధంగా అర్హత లేని వారికి ప్రమోషన్లు కల్పించారన్న ఆరోపణలపై వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరింది. ప్రమోషన్ల ప్రక్రియలో ఆర్థిక అవకతవకలు జరిగాయా అనే అంశంపైనా విచారణ జరపాలని విజ్ఞప్తి చేసింది. ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు, ప్రభుత్వం అధికారికంగా స్పందించాల్సి ఉంది.

**1998 అర్హత కలిగిన జూనియర్ లెక్చరర్లకు న్యాయం చేయాలి**
యూజీసీ నిబంధనలను అమలు చేస్తూ అర్హులైన ఉద్యోగులకు న్యాయం చేయాలని, ముఖ్యంగా 1998లో అర్హతలు సాధించిన జూనియర్ లెక్చరర్లకు జరిగిన అన్యాయాన్ని పరిష్కరించాలని క్యూజీడీఎల్ఏ డిమాండ్ చేసింది. పెండింగ్‌లో ఉన్న ప్రిన్సిపల్ ప్రమోషన్లను త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రత్యేక డీపీసీ నిర్వహించాలని కోరింది. ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి, సంబంధిత ఉన్నతాధికారులు ఈ వ్యవహారంపై ప్రత్యేక దృష్టి సారించి సమగ్రంగా పరిశీలించాలని క్యూజీడీఎల్ఏ విజ్ఞప్తి చేసింది. విద్యా రంగంపై ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలకు అనుగుణంగా పరిపాలనలోనూ పారదర్శకత, నిబంధనల అమలు ఉండాలని పేర్కొంది. ఈ మేరకు క్యూజీడీఎల్ఏ అధ్యక్షుడు డా. టి.ఎస్. ప్రవీణ్ కుమార్, జనరల్ సెక్రటరీ డా. బి. బాలయ్య పత్రికా ముఖంగా ప్రకటన విడుదల చేశారు. అర్హులైన వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రత్యేక డీపీసీ నిర్వహించి ప్రిన్సిపల్ ప్రమోషన్లను త్వరితగతిన చేపట్టాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

## బీసీ సంక్షేమ శాఖ ప్రమోషన్లపై
# ఉద్యోగవర్గాల్లో తీవ్ర చర్చ

- విచారణలు, ఆడిట్ అభ్యంతరాల మధ్య పదోన్నతులపై ప్రశ్నలు.. పోస్టింగులపైనా ఆరోపణలు




**హైదరాబాద్ జోర్దార్ ప్రతినిధి**
బీసీ సంక్షేమ శాఖలో ఇటీవల చేపట్టిన ఉన్నతస్థాయి పదోన్నతుల ప్రక్రియ ఉద్యోగవర్గాల్లో తీవ్ర చర్చకు దారితీస్తోంది. ప్రమోషన్ల కోసం అర్హతలు, సర్వీస్ రికార్డులు, పెండింగ్‌లో ఉన్న విచారణలు, క్రమశిక్షణా అంశాలను పూర్తిగా పరిశీలించారా? అనే ప్రశ్నలు ఇప్పుడు శాఖలో వినిపిస్తున్నాయి. కొందరు అధికారులపై గతంలో వచ్చిన ఫిర్యాదులు, కొనసాగుతున్న విచారణలను పరిగణనలోకి తీసుకోకుండానే పదోన్నతులు కల్పించారనే ఆరోపణలను ఉద్యోగ సంఘాల ప్రతినిధులు లేవనెత్తుతున్నారు. ఇదే సమయంలో కీలక పోస్టులకు పోస్టింగుల విషయంలోనూ పారదర్శకతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. శాఖలో ఖాళీగా ఉన్న డిప్యూటీ డైరెక్టర్ స్థాయి పోస్టులతోపాటు గురుకుల సొసైటీ, బీసీ కార్పొరేషన్‌కు సంబంధించిన కీలక స్థానాల భర్తీకి సంబంధించి డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ ప్రక్రియ జరిగినట్లు ఉద్యోగవర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో ప్రమోషన్‌కు అర్హత సాధించిన అధికారుల సేవా వివరాలతోపాటు వారిపై ఉన్న శాఖాపరమైన కేసులు, విచారణల స్థితి, ఆడిట్ అభ్యంతరాలు వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని ఉద్యోగ సంఘాలు పేర్కొంటున్నాయి. కొంతమంది అధికారులపై గతంలో కుల ధ్రువీకరణ, పరిపాలనా వ్యవహారాలు, విధులకు గైర్హాజరు, ప్రోటోకాల్ అంశాలతో పాటు ఇతరస్త్ర శాఖాపరమైన ఆరోపణలకు సంబంధించి విచారణలు లేదా ఫిర్యాదులు ఉన్నాయని ఉద్యోగవర్గాలు చెబుతున్నాయి. ఆయా వ్యవహారాలపై తుది నిర్ణయాలు వెలువడకముందే పదోన్నతులు కల్పించినట్లయితే దానికి సంబంధించిన నిబంధనలు, ప్రభుత్వ మార్గదర్శకాలు ఏమిటో స్పష్టం చేయాలని వారు కోరుతున్నారు. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత అధికారుల అధికారిక వివరణ మాత్రం వెలువడాల్సి ఉంది. హాస్టళ్ల నిర్వహణ, విద్యార్థులకు సంబంధించిన చెల్లింపులు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది వేతనాలు, విదేశీ విద్యా పథకం తదితర అంశాల్లో గతంలో వచ్చిన ఫిర్యాదులు, ఆడిట్ అభ్యంతరాల పరిస్థితిపైనా ఉద్యోగ సంఘాలు ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ఈ అంశాలపై ఏవైనా విచారణలు పెండింగ్‌లో ఉన్నాయా? ఉంటే వాటి ప్రస్తుత స్థితి ఏమిటి? సంబంధిత అధికారుల ప్రమోషన్ ప్రక్రియలో వాటిని ఎలా పరిగణనలోకి తీసుకున్నారు? అనే విషయాలను శాఖ ఉన్నతాధికారులు వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు పదోన్నతుల అనంతరం కీలక పోస్టింగుల విషయంలో కూడా ముందుగానే కొందరి పేర్లు ప్రచారంలోకి రావడం చర్చనీయాంశంగా మారింది. అధికారిక ఉత్తర్వులు వెలువడకముందే కొన్ని పోస్టులకు ఫలానా అధికారులు వస్తారంటూ శాఖలో చర్చ జరుగుతోందని ఉద్యోగవర్గాలు చెబుతున్నాయి. పోస్టింగులకు సంబంధించి 'సీటుకో రేటు' అంటూ వస్తున్న ఆరోపణలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి వాస్తవాలను వెలుగులోకి తేవాలని వారు కోరుతున్నారు. ఇలాంటి ఆరోపణలకు ఆధారాలుంటే వాటిపై కూడా నిష్పాక్షికంగా విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రమోషన్లు, పోస్టింగులకు సంబంధించిన ఫైలు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేషీకి చేరినట్లు ఉద్యోగవర్గాల్లో ప్రచారం జరుగుతోంది. బీసీ సంక్షేమ శాఖకు సంబంధించిన పలు కార్యక్రమాలపై మంత్రి ఇటీవల అధికారులతో సమీక్షలు నిర్వహించిన విషయం కూడా వార్తల్లోకి వచ్చింది. అయితే ప్రస్తుతం చర్చలో ఉన్న ప్రమోషన్లు, పోస్టింగులపై తుది అధికారిక ఉత్తర్వులు లేదా శాఖాపరమైన వివరణ అందుబాటులోకి రావాల్సి ఉంది. పదోన్నతుల ప్రక్రియలో ఎలాంటి అవకతవకలు జరగలేదని నిర్ధారించేందుకు సంబంధిత అధికారుల సర్వీస్ రికార్డులు, పెండింగ్ విచారణలు, ఆడిట్ నివేదికలు, క్రమశిక్షణా చర్యలు, ప్రమోషన్ కమిటీ నిర్ణయాలను ప్రభుత్వం సమగ్రంగా పరిశీలించాలని ఉద్యోగ సంఘాలు కోరుతున్నాయి. ఆరోపణల్లో వాస్తవం ఎంత, నిబంధనల ప్రకారం ప్రక్రియ జరిగిందా, పోస్టింగుల విషయంలో ఎలాంటి ప్రమాణాలు పాటించారు అనే విషయాలపై స్పష్టత ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్నారు. పూర్తి వివరాలు అధికారికంగా వెల్లడైతేనే ప్రస్తుతం నెలకొన్న అనుమానాలకు తెరపడుతుందని ఉద్యోగవర్గాలు పేర్కొంటున్నాయి.

## ధాన్యం తనిఖీలపై అనుమానాల మబ్బులు..
# కరీంనగర్‌లో లెక్కల గుట్టు ఏమిటి?




**కరీంనగర్ జోర్దార్ ప్రతినిధి**
రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ధాన్యం నిల్వల్లో పారదర్శకత కోసం చేపట్టిన రాండమ్ తనిఖీలపై కరీంనగర్ జిల్లాలో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సివిల్ సప్లై కార్పొరేషన్ పరిధిలోని రైస్ మిల్లుల్లో ప్రతి బుధవారం యాదృచ్ఛికంగా తనిఖీలు నిర్వహించి, మిల్లుల్లో ఉన్న భౌతిక నిల్వలను రికార్డులతో సరిపోల్చాల్సి ఉండగా, కొన్ని ప్రాంతాల్లో ఈ ప్రక్రియ తూతూమంత్రంగా సాగుతోందని ప్రజా సంఘాలు, ప్రతిపక్ష నాయకులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ ధాన్యం నిల్వల్లో వాస్తవ పరిస్థితిని గుర్తించాల్సిన తనిఖీలు క్షేత్రస్థాయిలో కాకుండా కాగితాలకే పరిమితమవుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.
ఇటీవల జిల్లాలో తనిఖీల కోసం వచ్చిన రాష్ట్రస్థాయి సివిల్ సప్లై కార్పొరేషన్‌కు చెందిన ఓ డైరెక్టర్ పర్యటన కూడా చర్చనీయాంశంగా మారింది. గతంలో కరీంనగర్ జిల్లాలో వివిధ హోదాల్లో పనిచేసిన సదరు అధికారి ప్రస్తుతం రాష్ట్రస్థాయిలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే జిల్లాలో వివాదాస్పదంగా ఉన్న ఓ రైస్ మిల్లర్‌తో ఆయన సన్నిహితంగా మెలిగినట్లు, కలిసి పర్యటించినట్లు ఆరోపణలు రావడంతో పలు వర్గాల్లో చర్చ మొదలైంది. ప్రభుత్వ ధాన్యం నిల్వల తనిఖీల కోసం వచ్చిన అధికారి, తనిఖీల పరిధిలో ఉన్న మిల్లర్‌తో ఇంత సన్నిహితంగా వ్యవహరించాల్సిన అవసరం ఏమిటని ప్రజా సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. ఈ వ్యవహారంపై సంబంధిత శాఖ స్పష్టత ఇవ్వాలని వారు కోరుతున్నారు.
జిల్లాలో గతంలో అక్రమ రీసైక్లింగ్ వ్యవహారాలకు సంబంధించి ఆరోపణలు ఎదుర్కొన్న ఓ మిల్లర్‌తో రాష్ట్రస్థాయి అధికారి కలిసి తిరగడం వల్ల తనిఖీల నిష్పక్షపాతంపై అనుమానాలు కలుగుతున్నాయని ప్రతిపక్ష నాయకులు అంటున్నారు. అయితే అధికారిపై వచ్చిన ఆరోపణలు నిర్ధారిత వాస్తవాలు కావని, వాటిపై సంబంధిత అధికారులు వివరణ ఇవ్వాల్సి ఉందని పేర్కొంటున్నారు. తనిఖీల సమయంలో ఎవరెవరిని కలిశారు, ఏ మిల్లులను పరిశీలించారు, అక్కడ ఏ మేరకు నిల్వలు గుర్తించారు, రికార్డులతో ఎంత తేడా ఉంది అనే వివరాలు అధికారికంగా వెల్లడిస్తే అనుమానాలకు తెరపడుతుందని ప్రజా సంఘాలు చెబుతున్నాయి. ప్రభుత్వ ధాన్యం నిల్వల విషయంలో అసలు పరిశీలించాల్సిన అంశం రికార్డుల్లో ఉన్న పరిమాణం, మిల్లుల్లో వాస్తవంగా ఉన్న ధాన్యం మధ్య తేడా. మిల్లుల్లో నిల్వలను భౌతికంగా లెక్కించి, రికార్డులు, మిల్లింగ్ వివరాలు, తరలింపు వివరాలతో సరిపోల్చినప్పుడే వాస్తవ పరిస్థితి బయటపడుతుంది. అయితే కొన్ని మిల్లుల్లో నిల్వల్లో లోటుపాట్లు ఉన్నప్పటికీ వాటిని పూర్తిస్థాయిలో నమోదు చేయకుండా నివేదికలు రూపొందిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. లోపాలను గుర్తించినా వాటిపై స్పష్టమైన రిమార్కులు నమోదు చేయడం లేదని, ఉన్నతాధికారులకు వాస్తవ పరిస్థితికి భిన్నంగా నివేదికలు వెళ్తున్నాయని కొందరు ఆరోపిస్తున్నారు.
సైదాపూర్ మండల పరిధిలోని మిల్లుల తనిఖీలపైనా ఇదే తరహా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సంబంధిత మిల్లులకు అధికారులు క్షేత్రస్థాయిలో వెళ్లి భౌతిక నిల్వలను పరిశీలించారా? రికార్డుల్లో చూపుతున్న పరిమాణంతో వాస్తవ నిల్వలను సరిపోల్చారా? లోటు ఉంటే దానిని తనిఖీ నివేదికల్లో నమోదు చేశారా? అనే అంశాలపై స్పష్టత లేదని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. కొన్ని తనిఖీలను ప్రభావితం చేసేందుకు మిల్లర్ల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు చేతులు మారుతున్నాయనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి ఇప్పటివరకు అధికారికంగా నిర్ధారణ వెలువడాల్సి ఉంది.
రాండమ్ తనిఖీల ప్రధాన ఉద్దేశమే ప్రభుత్వ ధాన్యం నిల్వల్లో అక్రమాలను గుర్తించడం, రికార్డులు--భౌతిక నిల్వల మధ్య తేడాలను బయటపెట్టడం. అలాంటి తనిఖీలకు ముందే సమాచారం చేరడం, క్షేత్రస్థాయిలో పూర్తి పరిశీలన జరగకపోవడం లేదా లోపాలను నివేదికల్లో నమోదు చేయకపోవడం జరిగితే ప్రభుత్వ విధానం ఉద్దేశమే దెబ్బతింటుందని ప్రజా సంఘాలు అంటున్నాయి. అందువల్ల జిల్లాలో ఇటీవల నిర్వహించిన అన్ని రాండమ్ తనిఖీల వివరాలను ఉన్నతస్థాయిలో మరోసారి పరిశీలించాలని, తనిఖీ చేసిన మిల్లుల భౌతిక నిల్వలు, రికార్డులు, అధికారుల నివేదికలను సరిపోల్చాలని వారు కోరుతున్నారు.
ముఖ్యంగా రాష్ట్రస్థాయి అధికారి పర్యటనపై వచ్చిన ఆరోపణలు, వివాదాస్పద మిల్లర్‌తో ఆయన సాన్నిహిత్యంపై వ్యక్తమవుతున్న సందేహాలు, సైదాపూర్ మండలంలో తనిఖీల తీరుపై వస్తున్న ఆరోపణలు, మిల్లుల్లో ధాన్యం నిల్వలపై ఉన్న అనుమానాలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించాలని ప్రజా సంఘాలు, ప్రతిపక్ష నాయకులు డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి, సివిల్ సప్లై కార్పొరేషన్ కమిషనర్ ఈ వ్యవహారంపై ప్రత్యేక దృష్టి సారించి సమగ్ర విచారణకు ఆదేశించాలని, ఆరోపణలు వాస్తవమని తేలితే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రభుత్వ ధాన్యం విషయంలో ఒక్క కిలో ధాన్యం కూడా పక్కదారి పట్టకుండా తనిఖీలను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని వారు స్పష్టం చేస్తున్నారు.

## ఖైరతాబాద్ ఉప ఎన్నికలో కాంగ్రెస్‌కు
# రాజకీయ నిమజ్జనం ఖాయం



**కరీంనగర్ జిల్లా, సెప్టెంబర్ 20 :**
కాంగ్రెస్‌పై కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ విమర్శలు చేశారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికలో కాంగ్రెస్‌కు రాజకీయ నిమజ్జనం చేయడం ఖాయమని ఎద్దేవా చేశారు. ఈరోజు (ఆదివారం) కరీంనగర్‌లో బండి సంజయ్ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. దానం నాగేందర్ తను వినాయకుడితో పోల్చుకోవడం సరికాదని పేర్కొన్నారు. వినాయకుడిని చివరిలో నిమజ్జనం చేస్తారనే విషయం దానం నాగేందర్‌కు తెలియదా.? అని ప్రశ్నించారు. దానం నాగేందర్ నిండు నూరేళ్లు జీవించాలని బండి సంజయ్ కోరుకున్నారు. కాంగ్రెస్ తమకు పోటీనే కాదని స్పష్టం చేశారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికను ఎదుర్కొనే సత్తా కాంగ్రెస్‌కు లేదని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ నేతల ఫాంహౌస్ సందర్శన ఓ జోక్ లాగా ఉందని వ్యంగ్యంగా మాట్లాడారు. కేసీఆర్ కుటుంబ ఫాంహౌస్‌లు ఏమైనా టూరిజానికి కేంద్రాలా.? అని ప్రశ్నించారు. ప్రైవేటు భూముల్లోకి వెళ్లడానికి కాంగ్రెస్ నేతలకు అధికారం ఎక్కడదని బండి సంజయ్ ప్రశ్నించారు.

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం



## అనారోగ్యంతో మృతి చెందిన స్నేహితుడి కుటుంబానికి అండగా పదో తరగతి స్నేహితులు



**భూపాలపల్లి,జోర్దార్ ప్రతినిధి:**చిట్యాల మండలం తిరుమలపురం గ్రామానికి చెందిన ఎలగొండ స్వామి అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన 1999--2000 బ్యాచ్ పదో తరగతి స్నేహితులు కుటుంబానికి అండగా నిలిచారు.

స్నేహితులందరి సహకారంతో సేకరించిన నగదును చిట్యాల పోస్టాఫీసులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి, అందుకు సంబంధించిన పాస్‌బుక్‌ను మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆపద సమయంలో తోటి స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి తమ స్నేహ బంధాన్ని చాటుకున్న స్నేహితులను పలువురు అభినందించారు.

కార్యక్రమంలో సరిగొమ్ముల రాజేందర్, గుర్రం శంకర్, ఉప్పుల కిరణ్, గుర్రం తిరుపతి, శీలపాక రాజు, పోరండ్ల రమేష్, ఎలగొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు మండల కార్యాలయంలో ప్రజావాణి



**హసన్ పర్తి,జోర్దార్ ప్రతినిది:**ప్రభుత్వ ఆదేశాల మేరకు సెప్టెంబర్ నేడు మండల కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సుమనవాణి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజావాణి కొనసాగుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి మండల స్థాయిలోని అన్ని శాఖలకు చెందిన అధికారులు హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులు స్వీకరించ నున్నట్లు తెలిపారు. మండల పరిధిలోని ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు, వినతిపత్రాలతో ప్రజావాణికి హాజరై అధికారులకు అందజేయాలని సూచించారు.ప్రజల సమస్యలను సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునే అవకాశం ఉన్నందున ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

## రెండు దశాబ్దాల సేవలందించిన ఆశా కార్యకర్త మృతి



**హుజురాబాద్, జోర్దార్ ప్రతినిధి:**హుజురాబాద్ పట్టణ పరిధిలోని దమ్మక్కపేటకు చెందిన ఆశా కార్యకర్త గూడెల్లి శ్రీలత (40) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. గత 20 ఏళ్లుగా గ్రామంలో ఆశా కార్యకర్తగా సేవలందించిన ఆమె, ఇటీవల కామెర్లు (జాండీస్) వ్యాధితో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు.

కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి ఇంటింటికీ తిరుగుతూ ప్రజలకు సేవలందించడంతో పాటు గర్భిణీలు, చిన్నారు లకు వైద్య సేవలు అందించడంలో ఆమె కీలకంగా పనిచేశారు. శ్రీలత మృతితో దమ్మక్క పేటలో విషాదఛాయలు అలుముకున్నాయి. చెల్పూర్ పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామస్థులు ఆమె అంత్యక్రియలకు హాజరై కన్నీటి నివాళులర్పించారు.

## సిద్ధార్థనగర్‌లో ఘనంగా కుంకుమ పూజ



**హుజురాబాద్,జోర్దార్ ప్రతినిది:**హుజురాబాద్ మున్సిపల్ పరిధిలోని బోర్నపల్లి సిద్ధార్థనగర్ శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయంలో ఆదివారం ఏడో రోజు గణపతి ఉత్సవాల్లో భాగంగా సిద్ధార్థనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కుంకుమ పూజను ఘనంగా నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో గణనాథునికి పూజలు చేశారు. పందిళ్ల భాస్కర శర్మ పూజారి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మంగళహారతి, తీర్థప్రసాదాలు, అన్నదానం చేపట్టారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విఘ్నేశ్వర యూత్ అసోసియేషన్ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

సాగి వీరభద్రరావు--వనిజ దంపతులు అన్నదానాన్ని నిర్వహించారు.

# అక్షిత రాణి ది హత్యే

- పాఠాలు నేర్పిన పంతులే హంతకుడు..
- బలవంతంగా పురుగుల మందు తాగించి.. ఆత్మహత్యగా చిత్రీకరించి
- పోలీసుల దర్యాప్తులో వీడిన మిస్టరీ..
- గోదావరిఖనిలో నిందితుల అరెస్టు చూపిన పెద్దపల్లి డిసిపి..



**(గోదావరిఖని జోర్దార్ ప్రతినిధి)** అక్షిత రాణి ఆత్మహత్య ఘటనలో మిస్టరీ వీడింది. పాఠాలు నేర్పించిన పంతులే హంతకుడిగా నిర్ధారణ జరిగింది. పథకం ప్రకారం బలవంతంగా పురుగుల మందు తాగించి.. ఆ పై ఆత్మహత్య గా చిత్రీకరించినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. నిందితులు కటకటాల పాలు కావడంతో ఈ కథ సుఖాంతమైంది. సంఘటనకు సంబంధించి వివరాలు.. ఇటీవల గోదావరిఖనిలో పాలిటెక్నిక్ విద్యార్థిని అక్షితరాణి మృతి చెందిన సంఘటన విధితమే. సింగరేణి గోదావరిఖని రెండవ గనిలో శిక్షణ కోసం వచ్చిన తనను గని ఓవర్ మెన్ వేధింపులకు గురి చేస్తున్నాడని, ఈ విషయమై సింగరేణి అర్జీ వన్ జీఎంకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదంటూ సూసైడ్ నోట్ రాసి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలం సృష్టించింది. మృతురాలి కుటుంబంకు న్యాయం జరగాలని దళిత సంఘాల నాయకులు ఆందోళనలు చేపట్టారు. అయితే పోలీసుల దర్యాప్తులో సంఘటన అనేక మలుపులు తిరుగుతూ వస్తుండగా చివరకు అది ఆత్మహత్య కాదు హత్యేనని తేలిపోయింది. ఈ మేరకు ఆదివారం నాడు గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో జరిగిన విలేకరుల సమావేశంలో పెద్దపల్లి డిసిపి భూక్య రామ్ రెడ్డి నాయక్, గోదావరిఖని ఏసిపి మడత రమేష్ నిందితుల అరెస్టు వివరాలను వెల్లడించారు. పాలిటెక్నిక్ కళాశాల లెక్చరర్ జెట్టి నవీన్ కుమార్ , సింగరేణి ఓవర్ మెన్ రవికుమార్ లు తమకే దక్కాలని అసూయ తో హత్య చేసి ఆత్మహత్య గా చిత్రీకరించినట్లు వెల్లడించారు. ప్రధాన నిందితుడు జెట్టి నవీన్ కుమార్ గా నిర్ధారణ జరిగిందని తెలిపారు. అక్షిత వాడిన సెల్ ఫోన్ కాల్ డాటా ఆధారంగా కేసును లోతుగా దర్యాప్తు చేయడంతో నిందితుల హత్యోదంతం బయటపడిందని తెలిపారు. పథకం ప్రకారం ఆమెతో బలవంతంగా గడ్డి మందు తాగించి ఆత్మహత్యగా చిత్రీకరించినట్లు తెలిపారు. ఈ మేరకు నిందితులను అరెస్టు చేసి రిమాండ్కు తరలిస్తున్నట్లు స్పష్టం చేశారు. నిందితుల వద్ద నుంచి కారు, సెల్ ఫోను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

## చేనేత సమస్యలను మంత్రి పొన్నంకు వివరించిన వీరు మోహన్ బృందం



**ఆదిలాబాద్,జోర్దార్ ప్రతినిధి:**తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం శనివారం హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రికి వివరించి, చేనేత రంగ అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు.

కార్మికుల సంక్షేమం, ఉపాధి అవకాశాల మెరుగుదల, ప్రభుత్వ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

కార్యక్రమంలో జెల్ల రఘు, చెరుకు విజయ్, మామిడాల దశరథ్, అందె జ్యోతిగణేష్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీసాయి నగర్‌లో గణపతి నవరాత్రి ఉత్సవాలు





- 23 జంటలతో మహా హోమం
- భక్తులకు అన్నప్రసాద వితరణ

**హసన్‌పర్తి,జోర్దార్ ప్రతినిధి:**గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 56వ డివిజన్ శ్రీసాయి నగర్‌లో గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా కొనసాగుతున్నాయి.ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఏడో రోజు గణనాథుడికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను రఘునందన్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఆకునూరి మహేందర్ హాజరై గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం ముత్తినేని రాజేశ్వరరావు--రజిత దంపతుల ఆధ్వర్యంలో 23 జంటలతో మహా హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

అనంతరం ప్రభాకర్ గౌడ్--లావణ్య దంపతుల ఆధ్వర్యంలో భక్తులకు మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు, అన్నప్రసాదాన్ని స్వీకరించారు.ఈ కార్యక్రమంలో తంగేళ్లపల్లి సాంబమూర్తి, వలబోజు ఉపేందర్‌రావు, చిర్ర తిరుపతి,లింగయ్య, మల్లాడి జ్ఞానేందర్‌రెడ్డి, వీరారెడ్డి,రాజారెడ్డి, మలహర్‌రావు,శోభ, అన్నపూర్ణ,తరంగిణి తదితరులు పాల్గొన్నారు.

## ఘోర రోడ్డు ప్రమాదం వైద్యుడు సజీవ దహనం



**సూర్యాపేట,జోర్దార్ ప్రతినిధి:**సూర్యాపేట--ఖమ్మం 365 జాతీయ రహదారిపై ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. పిల్లలమర్రి సమీపంలో వేగంగా వెళ్తున్న వోల్వో కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన వెంటనే కారులో మంటలు చెలరేగడంతో అందులో ఉన్న వ్యక్తి మంటల్లో చిక్కుకుని సజీవ దహనమయ్యారు.సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతుడిని ఖమ్మంలోని మమత హాస్పిటల్‌కు చెందిన న్యూరో సర్జన్ డాక్టర్ కాశకుర్తి జగదీష్గా పోలీసులు గుర్తించారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. వైద్యుడు మృతి చెందడంతో ఖమ్మంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## సింగరేణి స్థలాల్లో ఇళ్లకు త్వరలో పట్టాలు




- 22 వేల కుటుంబాలకు లబ్ధి చేకూరేలా చర్యలు

**బెల్లంపల్లి,జోర్దార్ ప్రతినిధి:**సింగరేణి ప్రాంతాల్లో సింగరేణి స్థలాల్లో కార్మికులు, కార్మికేతరులు నిర్మించుకున్న ఇళ్లకు త్వరలో పట్టాలు ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటించడంతో ఆయా ప్రాంతాల ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది.రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో సింగరేణి ప్రాంత ఎమ్మెల్యేలతో త్వరలో సమావేశం ఏర్పాటు చేసి రెగ్యులరైజేషన్ ప్రక్రియను ప్రారంభిస్తామని మంత్రి తెలిపారు. 2009లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జారీ చేసిన జీవో 76 ప్రకారం ఇళ్ల పట్టాలు జారీ చేయనున్నట్లు వెల్లడించారు.ఈ ప్రక్రియ ద్వారా పెద్దపల్లి, మంచిర్యాల, కొత్తగూడెం, భూపాలపల్లి జిల్లాల పరిధిలో సుమారు 22 వేల కుటుంబాలకు ప్రయోజనం కలగనుంది. శ్రీరాంపూర్ పరిధిలోని క్యాతనపల్లి మున్సిపాలిటీలో 1,500, శ్రీరాంపూర్ ఏరియాలో 1,400, బెల్లంపల్లి ఏరియాలో 4,000, గోదావరిఖనిలో 6,000, కొత్తగూడెం రీజియన్‌లో 7,700, భూపాలపల్లి జిల్లాలో 2,000 ఇళ్ల స్థలాలకు పట్టాలు అందించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి వివరించారు.

ఇళ్లకు హక్కు పత్రాలు లేకపోవడంతో బ్యాంకు రుణాలు పొందలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ఈ నిర్ణయం ఉపశమనం కలిగించనుంది.

ప్రభుత్వం ప్రకటించిన ప్రకారం త్వరితగతిన రెగ్యుల రైజేషన్ ప్రక్రియ పూర్తి చేసి పట్టాలు అందించాలని సింగరేణి ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

## హనుమకొండ మిస్సయిన బాధిత బాలిక జాడ ఎక్కడ...?

- ఇంత నిర్లక్ష్యమా...!
- అధికారులపై చర్యలు ఎప్పుడు...?

**(హనుమకొండ జోర్దార్ ప్రతినిధి)**పోక్సో బాధితురాలు అదృశ్యం అయి 22.రోజులు దాటింది అని పత్రికా ముఖంగా బహిర్గతం చేసినా ఇంకా చలనం లేని అధికారులు.తక్షణమే సంబంధిత అధికారులను సస్పెండ్ చేసి విచారణ జరపాలని బాలల హక్కుల సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

అసలు ఎందుకు ఈ నిర్లక్ష్యపు ధోరణి. అధికారులపై చర్యలు లేవా అని ప్రశ్నిస్తున్నారు తెలుస్తుంది.

వివరణ కోసం ప్రయత్నించగా నిర్లక్ష్యపు సమాధానం చెప్తూ కాలయాపన చేస్తున్నారు. పర్యవేక్షణ లోపం కారణంగానే ఈ యొక్క తప్పిదం జరిగింది అని మేధావులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం


# ఎర్రవల్లి ఘటనపై రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర

■ దళితుల ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణే లక్ష్యం
■ ఎమ్మెల్యే కవ్వంపల్లి

కరీంనగర్,జోర్దార్ ప్రతినిధి:ఎర్రవల్లి శుద్ధీకరణ ఘటనపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు దళితుల ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణ కోసం రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర నిర్వహించనున్నట్లు మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. ఆదివారం ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రతినిధులు, జిల్లా అధ్యక్షులు, ముఖ్య నాయకులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాదయాత్రకు సంబంధించిన అంశాలను ఆయన వెల్లడించారు.




దళితుల పట్ల వివక్ష, అంటరానితనం వంటి సామాజిక దురాచారాలకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందని కవ్వంపల్లి అన్నారు. ఉత్తరాది రాష్ట్రాలకే పరిమితమైందని భావించిన అంటరానితనం వంటి ఘటనలు తెలంగాణలోనూ చోటుచేసుకోవడం ఆందోళన కలిగించే విషయమన్నారు. ఇలాంటి ఘటనలపై దళితులు, ప్రజాస్వామ్యవాదులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఎర్రవల్లి శుద్ధీకరణ ఘటన దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న పాదయాత్రలో ప్రతి పల్లె, ప్రతి దళితవాడకు వెళ్లి ఘటనపై ప్రజలకు వివరించి సామాజిక చైతన్యం కల్పిస్తామని తెలిపారు. పాదయాత్రకు సంబంధించిన పూర్తి కార్యాచరణను త్వరలో ప్రకటిస్తామన్నారు.

ఈ నెలాఖరులోగా రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, మండలాలు, ఇతర స్థాయిల్లో ఎస్సీ సెల్ కమిటీల ఏర్పాటు ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా అధ్యక్షులను ఆదేశించారు. కమిటీల ఏర్పాటులో ఇబ్బందులు ఎదురైతే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. నిర్ణీత గడువులోగా కమిటీలను ఏర్పాటు చేయకపోతే సంబంధిత జిల్లా అధ్యక్షులను బాధ్యులను చేసి చర్యలు తీసుకుంటామని కవ్వంపల్లి స్పష్టం చేశారు

## పోతిరెడ్డిపేటలో గణనాథులను దర్శించుకున్న బీసీ జేఏసీ నాయకులు



హుజురాబాద్,జోర్దార్ ప్రతినిది:హుజురాబాద్ మండలం పోతిరెడ్డిపేట గ్రామంలోని గణనాథులను బీసీ జేఏసీ గౌరవ అధ్యక్షులు చందుపట్ల జనార్ధన్ ఆధ్వర్యంలో నాయకులు ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా జనార్ధన్, బీసీ జేఏసీ అధ్యక్షులు సందేల వెంకన్న మాట్లాడుతూ.. వినాయకుడి ఆశీస్సులతో గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ప్రజలంతా ఐకమత్యంతో ఉంటూ ఆదర్శవంతమైన గ్రామంగా పోతిరెడ్డిపేటను తీర్చిదిద్దాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ ప్రధాన కార్యదర్శి ఇప్పకాయల సాగర్, హుజురాబాద్ మండలం బీఆర్ఎస్ ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షులు వన్నాల శివాజీ, బీసీ జేఏసీ ఉపాధ్యక్షులు మా మునూరు ప్రవీణ్ కుమార్, కొలిపాక క్రాంతి కుమార్, పోగు సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## వీరాపూర్ పంట పొలాల రహదారి అధ్వానం

■ గుంతలమయమైన రోడ్డుతో రైతులు, కూలీలకు తీవ్ర ఇబ్బందులు

బెల్లంపల్లి జోర్దార్ ప్రతినిధి:కన్నెపల్లి మండలం వీరాపూర్ గ్రామం నుంచి పంట పొలాలకు వెళ్లే రహదారి పూర్తిగా అధ్వానంగా మారడంతో రైతులు, వ్యవసాయ కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రహదారి గుంతలమయంగా మారడంతో నిత్యం వ్యవసాయ పనుల కోసం పొలాలకు వెళ్లే రైతులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు.పంటలకు అవసరమైన ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు తదితర వ్యవసాయ సామగ్రిని పొలాలకు తరలించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురిసిన సమయంలో రహదారిపై నీరు నిలిచిపోవడంతో వ్యవసాయ సామగ్రి తడిసి నష్టపోయే పరిస్థితి ఏర్పడుతోందని తెలిపారు.



ఈ రహదారి ద్వారా సుమారు 200 ఎకరాల పంట పొలాలకు రైతులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారని పేర్కొన్నారు. వ్యవసాయ సీజన్‌లో, ముఖ్యంగా వర్షాకాలంలో రహదారి పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని తెలిపారు.సంబంధిత అధికారులు వెంటనే స్పందించి వీరాపూర్ నుంచి పంట పొలాలకు వెళ్లే రహదారికి శాశ్వత మరమ్మతులు చేపట్టి, రైతులకు రాకపోకల ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



హుజురాబాద్,జోర్దార్ ప్రతినిది:రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తనవంతు సహకారం ఎల్లవేళలా అందిస్తానని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, హుజురాబాద్ 12వ వార్డు కౌన్సిలర్ వర్ధినేని రవీందర్ రావు అన్నారు. ఆదివారం హుజురాబాద్ క్లబ్‌లో నిర్వహించిన రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగుల సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉద్యోగులు ఐక్యంగా ఉండి తమ హక్కుల కోసం పోరాడాలని సూచించారు.

సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తిని రాజయ్య మాట్లాడుతూ పెన్షన్, బకాయిలు, ఈపీఎఫ్ సమస్యల పరిష్కారం కోసం పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగులకు రావాల్సిన బకాయిల చెల్లింపుపై త్వరలో సానుకూల నిర్ణయం వచ్చే అవకాశం ఉందన్నారు.

మార్త రవీందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కార్యదర్శి పేరాల లక్ష్మణరావు, ట్రెజరర్ ఏబీ రెడ్డి, ముఖ్య సలహాదారు ఎంఆర్ మొగిలి, కమిటీ సభ్యులు పీఎస్ రెడ్డి, బీఆర్ మౌళి, కేపీ రెడ్డి, గోలి ఉపేందర్, వీడీ రెడ్డి, బత్తిని సంజీవ, కంకల కొమురయ్య, బి.మొగిలి తదితరులు పాల్గొన్నారు.

## తాడిచెర్లలో గణేష్ లడ్డుకు లక్షా రెండు వేల ధర!



■ రూ.1.02 లక్షలకు లడ్డును కైవసం చేసుకున్న ఏఎంఆర్ జేఎంఈలు

భూపాలపల్లి జోర్దార్ ప్రతినిధి :వినాయక చవితి సందర్భంగా తాడిచెర్లలోని ఏఎంఆర్ కంపెనీలో నిర్వహించిన గణేష్ లడ్డు వేలం పాట ఘనంగా జరిగింది. జూనియర్ మైనింగ్ ఇంజినీర్లు ఉత్సాహంగా పాల్గొని పోటాపోటీగా వేలం పాట నిర్వహించారు.చివరకు రూ.1,02,000లకు అత్యధిక ధర పలకడంతో జేఎంఈల బృందం గణేష్ లడ్డును కైవసం చేసుకుంది. వేలం సందర్భంగా ఉద్యోగుల్లో ఉత్సాహం వెల్లివిరిసింది.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ మూర్తి, మేనేజర్ శ్రీనివాస్, సేఫ్టీ ఆఫీసర్ సురేష్ బాబు హాజరై వేలం కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. వివిధ విభాగాలకు చెందిన అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.వినాయక చవితి సందర్భంగా నిర్వహించిన ఈ వేలం ఉద్యోగుల మధ్య ఐక్యత, సోదరభావం, భక్తి భావాలను చాటుతూ ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది.

## ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉచిత ఉపకరణాల నిర్ధారణ శిబిరం

హుజురాబాద్,జోర్దార్ ప్రతినిధి:ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉచిత సహాయక ఉపకరణాలు అందించేందుకు ఈ నెల 22న హుజురాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్ధారణ శిబిరం నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి విడపు శ్రీనివాస్ తెలిపారు. సమగ్ర శిక్ష, కరీంనగర్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిబిరానికి 0--18 ఏళ్లలోపు పిల్లలు హాజరు కావచ్చున్నారు.

సైదాపూర్, ఇల్లంతకుంట, శంకరపట్నం, వీణవంక, హుజురాబాద్ మండలాలకు చెందిన పిల్లలు సదరం సర్టిఫికెట్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు తీసుకురావాలని సూచించారు.



వివరాలకు **8639003735** నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

## పర్వతగిరి సీఐ సతీష్‌కు ఘన సన్మానం



■ దళిత, గిరిజన, మహిళలు, బాలికలకు రక్షణ కల్పించాలి
■ అంతర్జాతీయ మానవ హక్కుల ఆర్గనైజేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు పాలకుర్తి విజయ్ కుమార్

(వరంగల్ జోర్దార్ ప్రతినిధి)వరంగల్ జిల్లా మామునూరు డివిజన్ పరిధిలోని పర్వతగిరి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నూతన బాధ్యతలు స్వీకరించిన సతీష్‌ను అంతర్జాతీయ మానవ హక్కుల ఆర్గనైజేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు పాలకుర్తి విజయ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఐ సతీష్‌ను శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా పాలకుర్తి విజయ్ కుమార్ మాట్లాడుతూ దళితులు, గిరిజనులు, మహిళలు, బాలికలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా మైనర్ బాలికలపై జరుగుతున్న నేరాలను నియంత్రించేందుకు పోక్సో చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని అన్నారు.అలాగే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు మహిళలకు పూర్తి రక్షణ కల్పించాలని, మహిళా రక్షణకు సంబంధించిన చట్టాలను కట్టుదిట్టంగా అమలు చేయాలని సీఐ సతీష్‌ను కోరారు.నూతన బాధ్యతలు స్వీకరించిన సీఐ సతీష్‌కు శుభాకాంక్షలు తెలిపిన పాలకుర్తి విజయ్ కుమార్, ప్రజలకు అందుబాటులో ఉండే పోలీసింగ్ ద్వారా బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆకాంక్షించారు.

## బోయింగ్ సుకన్య స్టెమ్ ల్యాబ్‌కు దరియాపూర్ మోడల్ స్కూల్ ఎంపిక

ముత్తారం,జోర్దార్ ప్రతినిధి:దరియాపూర్ తెలంగాణ మోడల్ స్కూల్ దేశవ్యాప్తంగా ఎంపికైన 26 పాఠశాలల్లో ఒకటిగా, తెలంగాణ నుంచి ఏకైక పాఠశాలగా ప్రతిష్ఠాత్మక బోయింగ్ సుకన్య స్టెమ్ ల్యాబ్‌కు ఎంపికైంది. ఈ ఎంపికపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హర్షం వ్యక్తం చేస్తూ, విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది సమష్టి కృషికి లభించిన గుర్తింపుగా పేర్కొన్నారు. స్టెమ్ ల్యాబ్ ద్వారా సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథమెటిక్స్ రంగాల్లో విద్యార్థులకు ప్రయోగాత్మక అభ్యసనానికి అవకాశం కలుగుతుందని తెలిపారు. ఈ ఎంపికపై టీజీ మోడల్ స్కూల్స్ ఏడీ శ్రీనివాస చారి కూడా




హర్షం వ్యక్తం చేశారు.

## తాళ్ల పద్మావతి ఇంజినీరింగ్ కాలేజీ చైర్మన్ తాళ్ల మల్లేశం మృతి

కాజీపేట,జోర్దార్ ప్రతినిధి:కాజీపేట టౌన్ పరిధిలోని సోమిడి గ్రామానికి చెందిన తాళ్ల పద్మావతి ఇంజినీరింగ్ కాలేజీ విద్యాసంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం మృతి చెందారు. ఆదివారం గుండెపోటుతో ఆయన మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

తాళ్ల మల్లేశం మృతి విషయం తెలుసుకున్న విద్యాసంస్థల సిబ్బంది, విద్యార్థులు, బంధువులు, మిత్రులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆయన మృతితో సోమిడి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

విద్యారంగానికి తాళ్ల మల్లేశం అందించిన సేవలను పలువురు స్మరించుకున్నారు.ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.



## శివానికే రక్షణ కల్పించడంలో నిర్లక్ష్య వహించిన అధికారిపై జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలి

■ అంతర్జాతీయ మానవ హక్కుల ఆర్గనైజేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షులు పాలకుర్తి విజయ్ కుమార్

(వర్ధన్నపేట జోర్దార్ ప్రతినిధి)వర్ధన్నపేట నియోజకవర్గంలోని ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి మరణించిన శవాలకు రక్షణ కల్పించడంలో నిర్లక్ష్యం వహించిన ప్రభుత్వ అధికారులపై వరంగల్ జిల్లా కలెక్టర్ జిల్లా మెజిస్ట్రేట్ డాక్టర్ సత్య శారద సమగ్ర విచారణ చేపట్టాలని అంతర్జాతీయ మానవ హక్కుల ఆర్గనైజేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షులు వరంగల్ జిల్లా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటర్ కమిటీ మెంబర్ పాలకుర్తి విజయ్ కుమార్ పత్రికా ప్రకటన ద్వారా వరంగల్ జిల్లా కలెక్టర్ గారిని కోరారు బాధ్యులైన అధికారులను తగు చర్య తీసుకోవాలని కోరారు వర్ధన్నపేట శవ పరీక్ష గదిలో మృతుడు కంటిని కొరికేసిన ఎలుకలు పారిశుద్ధ్య నిర్వహణ తీవ్ర ప్రశ్నలు అధికారుల తీరుపై బంధువులు రాయపర్తి మండలానికి



చెందిన గారే వీరయ్య మృతదేహాన్ని ఎలుకలు కొరికిన ఘటనపై ఈ ఘటనపై జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి బాధ్యులపై తగు చర్య తీసుకోవాలని పాలకుర్తి విజయ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు

# ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

■ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**(వరంగల్ జోర్దార్ ప్రతినిధి)**వరంగల్ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఒక ప్రకటనలో తెలిపారు.

జిల్లా స్థాయిలో జిల్లా అధికారులు, రెవెన్యూ డివిజన్ స్థాయిలో రెవెన్యూ డివిజన్ అధికారులు, మండల స్థాయిలో మండల స్థాయి అధికారులు ప్రజావాణి కార్యక్రమన్ని నిర్వహిస్తారని పేర్కొన్నారు.

ప్రజావాణిలో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పరిశీలించి, సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

ప్రజలు తమ సమస్యలు పై వినతులను ప్రజావాణి ద్వారా అధికారుల దృష్టికి తీసుకువచ్చి సమస్యల పరిష్కరించే దిశ గా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు రెవిన్యూ,మండల స్థాయిల లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

# పిఆర్సి నివేదిక స్వీకరించి వెంటనే అమలు చేయాలి

■ డిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగారెడ్డి



**హనుమకొండ జోర్దార్ ప్రతినిధి:** ఉపాధ్యాయ, ఉద్యోగుల జేఏసీ తలపెట్టిన ఉద్యమం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఇచ్చిన లిఖిత పూర్వక హామీ మేరకు వెంటనే పిఆర్సి కమిషన్ నుండి రిపోర్ట్ తెప్పించుకొని అమలుకు చర్యలు చేపట్టాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. లింగారెడ్డిలు డిమాండ్ చేశారు.

డి టి ఎఫ్ హనుమకొండ జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు గాదరి ఉప్పలయ్య అధ్యక్షతన డిటిఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కట్కూరి శ్రీనివాస్ కార్యకలాపాల నివేదికను ప్రవేశపెట్టారు.

ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన టి.లింగారెడ్డి మాట్లాడుతూ.. పి ఆర్ సి గడువు ముగిసి మూడు సంవత్సరాలు కావస్తున్నందున,ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే పిఆర్సి నివేదిక తెప్పించుకొని 01.07.2023 నుండి అమలయ్యే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న 6 డి ఎ లు వెంటనే విడుదల చేయాలని, ఉద్యోగుల ఆరోగ్య పథకానికి సంబంధించి ఇప్పటికైనా సమగ్రమైన రీతిలో విధివిధానాలు రూపొందించి, సంబంధిత ఆసుపత్రులతో స్పష్టంగా చర్చించి ఆరోగ్య పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నారు.

సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని,2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వ మెమో ప్రకారము పాత పెన్షన్ అమలు విషయమై గతంలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2003 డి ఎస్ సి ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేసిన విధంగా తెలంగాణలో కూడా అమలు చేయాలన్నారు. పెండింగ్ లో ఉన్న ఉద్యోగుల, పెన్షనర్ల ఆర్థిక బిల్లులు వెంటనే చెల్లించాలని కోరారు.

రాష్ట్ర కార్యదర్శి అటుకుల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తికి సంబంధించి అశాస్త్రీయంగా ఉన్న జీవో 25 ను సవరించాలని, ప్రాథమిక స్థాయిలో తరగతికి ఒక గది, ఒక ఉపాధ్యాయుడు ఉండే విధంగా చూడాలన్నారు. పాఠశాలలు ప్రారంభమై మూడు నెలలు కావస్తున్నా ఇప్పటికీ విద్యార్థులందరికీ సరిపడ ఏకరూప దుస్తులు,బూట్లు, బ్యాగులు ఇతర వస్తువులు సరఫరా చేయలేదన్నారు. రోజురోజుకు పాఠశాలల్లో బోధనేతర పనులు ఎక్కువ అవుతున్నందున ఉపాధ్యాయుడు తరగతి గదికి దూరం చేయబడుతున్నాడన్నారు. ప్రైవేటు పాఠశాలలకు లేని ఈ బోధనేతర పనులు ప్రభుత్వ పాఠశాలలకు పెట్టడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై దృష్టి పెట్టి ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడాలన్నారు.

ఈ సమావేశంలో అధ్యాపక జ్వాల ప్రధాన సంపాదకులు డాక్టర్ ఎం.గంగాధర్, జిల్లా అధ్యక్షులు గాదరి ఉప్పలయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి కట్కూరి శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు జె. గోవర్ధన్, అల్లం మల్లయ్య, ఎస్.సుమ, ఎం.హర్షవర్ధన్ రెడ్డి, పి.చిన్నేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఏడు రోజుల పూజల అనంతరం గణేష్ నిమజ్జనం



**గద్వాల,జోర్దార్ ప్రతినిధి:**జోగులాంబ గద్వాల జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతిష్ఠించిన గణేష్ విగ్రహానికి ఏడు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆదివారం జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు, ఐపీఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం గణ నాథుడిని నిమజ్జనానికి ఘనంగా తరలించారు.

కార్యక్రమంలో ఆర్ఐలు నరేష్, టి. వెంకటేష్, ఆర్ఎస్ఐ చంద్రకాంత్, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు రఘుపతి నాయుడు, ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

# హుజూరాబాద్‌లో అంగన్వాడి ఉద్యోగాల పేరుతో మాయాజాలం?

■ ఒక్కో ఉద్యోగానికి రూ.3 లక్షల డిమాండ్ చేస్తున్నారంటూ ఆరోపణలు

■ ఇంటర్వ్యూలే జరగలేదు.. ప్రభుత్వ లోగో లేని పత్రాలపై అనుమానాలు

■ బ్రోకర్ల మాటలు నమ్మొద్దు.. నయాపైసా ఎవరికీ ఇవ్వొద్దు: సీడీపీఓ సుగుణ



GOVERNMENT OF TELANGANA
DEAPRTMENT OF WOMEN DEVELOPMENT & CHILD WELFARE
OFFICE OF THE DISTRICT COLLECTOR & DISTRICT LEVEL SELECTION

Proceedngs No. 920/ICDS-7/2026

Reporting timeline: The candidate must report for duty to the concerned (CDPO) within twenty (20) days from the date of receipt of this order.

District Level Selection Committee
DLSC
Karimnagar

**(హుజురాబాద్ జోర్దార్ ప్రతినిధి)**హుజూరాబాద్ ప్రాంతంలోని అంగన్వాడి కేంద్రాలకు సంబంధించిన ఉద్యోగాల భర్తీ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. అంగన్వాడి ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ కొందరు మధ్యవర్తులు, బ్రోకర్లు అభ్యర్థులను సంప్రదిస్తూ డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వెలువడుతున్నాయి. ఒక్కో ఉద్యోగానికి సుమారు రూ.3 లక్షల వరకు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో అభ్యర్థుల్లో ఆందోళన నెలకొంది.

**ఇంటర్వ్యూ జరగకుండానే ఉద్యోగాలా?**

అంగన్వాడి ఉద్యోగాల భర్తీకి సంబంధించి అధికారికంగా ఎంపిక ప్రక్రియ కొనసాగాల్సి ఉండగా, కొందరు వ్యక్తులు ఇంటర్వ్యూ లేకుండానే ఉద్యోగాలు ఇప్పిస్తామని చెబుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. అసలు ఇంటర్వ్యూలు నిర్వహించకుండానే నియామకాలు ఎలా జరుగుతాయనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అంగన్వాడి ఉద్యోగాలకు సంబంధించి ఖాళీ పోస్టులు ఎన్ని ఉన్నాయి..? దరఖాస్తులు ఎన్ని వచ్చాయి..? ఎంపిక ప్రక్రియ ఏ విధంగా ఉంటుంది..? అభ్యర్థుల మెరిట్‌ను ఏ విధంగా పరిగణనలోకి తీసుకుంటారు..? అనే అంశాలపై స్పష్టత అవసరమని అభ్యర్థులు కోరుతున్నారు.

**ప్రభుత్వ లోగో లేని పత్రాలపై అనుమానాలు**

అంగన్వాడి ఉద్యోగాలకు సంబంధించినవిగా కొందరు చూపిస్తున్న పత్రాలపై తెలంగాణ ప్రభుత్వ అధికారిక లోగో లేకపోవడం కూడా అనుమానాలకు తావిస్తోంది. ఆయా పత్రాలను ఎవరు జారీ చేశారు..? వాటికి అధికారిక గుర్తింపు ఉందా..? సంబంధిత మహిళా శిశు సంక్షేమ శాఖకు వాటితో ఏమైనా సంబంధం ఉందా..? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

**బోగస్ సంఘాల పేరుతో వ్యవహారం?**

కొన్ని సంఘాలు, సంస్థల పేర్లను ఉపయోగించి అంగన్వాడి ఉద్యోగాలు ఇప్పిస్తామని అభ్యర్థులను నమ్మిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఆయా సంఘాలకు ఉద్యోగాల భర్తీలో అధికారికంగా ఎలాంటి పాత్ర ఉంది..? ప్రభుత్వ అనుమతి ఉందా..? లేక ఉద్యోగాల పేరుతో అభ్యర్థులను మోసం చేసేందుకు సంఘాల పేర్లను ఉపయోగిస్తున్నారా..? అనే అంశాలపై విచారణ జరగాల్సి ఉంది.

**బ్రోకర్ల మాటలు నమ్మొద్దు**

ఈ ఆరోపణలపై హుజూరాబాద్ సీడీపీఓ సుగుణ స్పష్టతనిచ్చారు. అంగన్వాడి ఉద్యోగాల భర్తీ విషయంలో అభ్యర్థులు ఎవరూ బ్రోకర్ల మాటలు నమ్మి మోసపోవద్దని ఆమె సూచించారు. ఇప్పటివరకు ఇంటర్వ్యూలు జరగలేదని, ఉద్యోగాల కోసం ఎవరూ నయాపైసా కూడా ఎవరికీ ఇవ్వవద్దని స్పష్టం చేశారు.

**మెరిట్ ప్రకారమే ఉద్యోగాలు**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత ఉన్న అభ్యర్థులకు మెరిట్ ఆధారంగా ఉద్యోగాలు కల్పిస్తామని సీడీపీఓ సుగుణ తెలిపారు. ఎవరూ గాబరా పడాల్సిన అవసరం లేదని, మెరిట్ ఉన్న ప్రతి అభ్యర్థికి న్యాయం చేస్తామని స్పష్టం చేశారు.

అంగన్వాడి ఉద్యోగాలకు దరఖాస్తు చేసిన ప్రతి అభ్యర్థి మార్కులను కూడా డిస్ప్లే చేస్తామని ఆమె తెలిపారు. దీంతో ఎంపిక ప్రక్రియలో పారదర్శకత పాటిస్తామని అధికారులు చెబుతున్నారు.

**అభ్యర్థులు అప్రమత్తంగా ఉండాలి**

అధికారుల పేర్లు, సంఘాల పేర్లు చెప్పి ఉద్యోగాలు ఇప్పిస్తామని ఎవరైనా డబ్బులు అడిగితే అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ఉద్యోగ నియామకానికి సంబంధించి అధికారిక ప్రకటనలు, సంబంధిత శాఖ నుంచి వెలువడే సమాచారం మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

**విచారణతో తేలాల్సిన అంశాలు**

ఒక్కో అంగన్వాడి ఉద్యోగానికి రూ.3 లక్షల వరకు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు నిజమా..? ఎవరు ఈ వసూళ్లకు పాల్పడుతున్నారు..? బోగస్ సంఘాల పేర్లు ఉపయోగిస్తున్నారా..? ప్రభుత్వ లోగో లేని పత్రాలు ఎక్కడి నుంచి వచ్చాయి..?

అనే అంశాలపై స మగ్రంగా విచారణ జరిపితే అసలు విషయం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# అనుమతి లేకుండా చెట్ల నరికివేతపై కేసు



**సైదాపూర్,జోర్దార్ ప్రతినిధి:**సైదాపూర్ మండలం గర్రెపల్లి గ్రామంలో రోడ్డుపై అనుమతి లేకుండా చెట్లు నరికివేసిన ఘటనపై గ్రామపంచాయతీ కార్యదర్శి ఊస కోయిల రాజీవ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. చెట్లను నరికివేసి తరలించేందుకు ఉపయోగించిన ట్రాక్టర్‌ను అధికారులు సీజ్ చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రజలకు ఉపయోగపడే చెట్లను అనుమతులు లేకుండా నరికివేయడంపై గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేసి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

# వినాయక మండపం వద్ద అన్నదానం



**జోగులాంబ గద్వాల్ జోర్దార్ ప్రతినిధి:అయిజ:** పట్టణంలోని గాజులపేటలో రాక్ స్టార్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి మాల ఆచారి, సింగిల్ విండో మాజీ చైర్మన్ పోతుల మధుసూదన్ రెడ్డి, సంకాపురం రాముడు తదితరులు వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. యువత ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో కార్యక్రమం నిర్వహించడంపై పలువురు అభినందించారు.

# కారు రూపంలో కబళించిన మృత్యువు

## ఊపిరాడక నాలుగేళ్ల చిన్నారి దుర్మరణం



**జూలూరుపాడు :** సెలవు దినం.. ఆ ఇంట అంతా సందడిగా ఉంది. ఆడుకుంటూ అటూఇటూ తిరుగుతున్న ఆ నాలుగేళ్ల చిన్నారికి కారు రూపంలో మృత్యువు పొంచి ఉందన్న విషయం ఎవరూ ఊహించలేకపోయారు. ప్రమాదవశాత్తు కారులో ఇరుక్కుపోయి, ఊపిరాడక ఆ పసి ప్రాణం అనంతలోకాలకు చేరింది.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం వినోబానగర్ గ్రామంలో ఆదివారం చోటుచేసుకున్న ఈ హృదయ విదారక ఘటన గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ? వినోబానగర్ గ్రామ సర్పంచ్ గంగావత్ నవీన్‌ఐశ్వర్య దంపతుల పెద్ద కుమార్తె తన్వితశ్రీ (4) ఆదివారం ఆడుకుంటూ ఇంటి వద్ద నిలిచిన కారు లో ఎక్కింది. ప్రమాదవశాత్తు కారు డోర్ లాక్ కావడంతో ఊపిరాడక చనిపోయింది.ఆ సమయంలో తండ్రి నవీన్ వైరా ఎమ్మెల్యేను కలిసేందుకు సర్పంచులతో కలిసి ఉదయం కొత్తగూడెం వెళ్లారు. తల్లి ఐశ్వర్య ఇంటి పనుల్లో నిమగ్నమయ్యారు. చిన్నారి కనిపించకపోవడంతో తల్లి ఐశ్వర్య ఆందోళనకు గురయ్యై కుటుంబ సభ్యులతో కలిసి ఇల్లు, పరిసర ప్రాంతాలతో పాటు గ్రామంలో వెతికారు. ఎక్కడా ఆచూకీ దొరక్కపోవడంతో కారులో తన్వితశ్రీ అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని గమనించారు.

ప్రాణాపాయ స్థితిలో ఉన్న చిన్నారిని తొలుత జూలూరుపాడులోని ఓ గ్రామీణ వైద్యుడి వద్దకు అక్కడి నుంచి కొత్తగూడెం ఆసుపత్రికి తరలించారు. పాపను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించడంతో ఆ తల్లిదండ్రులు బోరున విలపించారు. విషయం తెలుసుకున్న వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, నాయకులు లేళ్ల వెంకటరెడ్డితో పాటు పలువురు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. నవీన్ దంపతులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు

# రంగనాయకుల గుట్ట వద్ద తాటిచెట్టుపై పిడుగు

**హుజురాబాద్,జోర్దార్ ప్రతినిధి:**హైదరాబాద్‌లోని రంగనాయకుల గుట్ట వద్ద ఆదివారం తాటి చెట్టుపై పిడుగు పడటంతో చెట్టు మధ్యభాగం స్వల్పంగా కాలిపోయింది.

వర్షం లేకుండానే ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో పిడుగు పడటంతో స్థానికులు భయాం దోళనకు గురయ్యారు.

ఆ సమయంలో చెట్టుపై గీత కార్మికుడు ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది.

గీత కార్మికులు చెట్లపై పనిచేసే సమయంలో ఇలాంటి ఘటనలు జరిగితే ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు.



## కరీంనగర్ జిల్లాలో పీఐసీ సహకర సంఘుల చైర్మన్ల నిబంధనల ఉల్లంఘున

# నిధుల గోల్‌మాల్‌పై తీవ్ర విమర్శలు!

- 1964 కోఆపరేటివ్ యాక్ట్ నిబంధనలకు విరుద్ధంగా అభివృద్ధి పనులకు తెగబడుతున్న వైనం
- సంఘు సంఘు సభ్యుల తీర్మానాలు, డీసీవో అనుమతులు లేకుండానే నిర్మాణ పనులు రాజకీయ ఒత్తిళ్లు
- పెట్టిన పెట్టుబడిని రికవరీ చేసుకోవడమే లక్ష్యంగా సీఈవోలపై వేధింపులు

**కరీంనగర్: జోర్దార్ ప్రతినిధి:**కరీంనగర్ జిల్లాలోని సహకార సంఘాల్లో పీఐసీ (పర్సన్‌ఇన్‌ఛార్జ్) కమిటీలుగా నామినేట్ అయిన కొంతమంది చైర్మన్ల తీరు తీవ్ర వివాదాస్పదమవుతోంది. సహకార సంఘాల్లో ఉన్న ధాన్యం కొనుగోలు కమిషన్ ద్వారా వచ్చిన డబ్బులు, వ్యాపార అభివృద్ధి నిధులు భారీగా ఉండటంతో.. ఆ నిధులను ఎలాగైనా కాజేయాలనే ఉద్దేశంతో కొందరు చైర్మన్లు నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణ పనులు..**

1964 కోఆపరేటివ్ యాక్ట్ నిబంధనల ప్రకారం.. సహకార సంఘాల్లో ఏ అభివృద్ధి పనులు చేపట్టాలన్నా సర్వసభ్య సమావేశం నిర్వహించి, సభ్యుల ఏకగ్రీవ తీర్మానం తీసుకోవాల్సి ఉంటుంది. అలాగే జిల్లా సహకార అధికారి అనుమతి తప్పనిసరి.

అయితే, ఈ నిబంధనల న్నింటిని తుంగలో తొక్కి కొందరు పీఐసీ చైర్మ న్లు రాజకీయ అండదండలతో ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నట్లు విమర్శలు వస్తున్నాయి.

**చట్ట నిబంధనలకు తూట్లు**

తెలంగాణ సహకార సంఘాల చట్టం-1964 ప్రకారం.పి.పి. పి ఐసికమిటీ కేవలం సంఘం యొక్క రోజువారీ నిర్వహణ మరియు అత్యవసర కార్యకలాపాలను మాత్రమే నిర్వహించడానికి పరిమితం చేయబడింది. ఎటువంటి పరిస్థితులలోనూ జనరల్ బాడీ ఆమోదం లేకుండా లక్షలాది రూపాయల అభివృద్ధి పనులు, భవన నిర్మాణాలు లేదా పెద్ద మొత్తంలో ఖర్చులు చేయడానికి వారికి ఎలాంటి చట్టబద్ధమైన అధికారం లేదు.

అయినప్పటికీ, కొన్ని సహకార సంఘ లలో ఈ కమిటీ సభ్యులు ఏ ఒక్క సభ్యుడికి సమాచారం ఇవ్వకుండా, ఎలాంటి తీర్మానాలు చేయకుండా పూర్తిగా ఏకపక్షంగా వ్యవహరిస్తూ సంఘం నిధులను దుర్వినియోగం చేసేందుకు కుట్ర పన్నుతు.కొన్ని సంఘలలో దుర్వినియోగ పరస్తున్నారు

సహకార సంఘం నిధులు కేవలం రైతులు మరియు సభ్యుల సంక్షేమం కోసం మాత్రమే ఉపయోగించాలి. కానీ బాధ్యతాయుతమైన స్థానాల్లో ఉండి నిబంధనలను ఉల్లంఘించడం, వ్యక్తిగత ప్రయోజనాల కోసం నిధులను ప్రయత్నించడం స్పష్టమైన ఆర్థిక నేరమని, నిబంధనల ప్రకారం పీఐసీ చైర్మన్లు ఎవరూ నేరుగా కాంట్రాక్టు పనుల్లో పాల్గొనకూడదు. కానీ, తాము పదవుల కోసం భారీగా ఖర్చుపెట్టి వచ్చామని, ఆ డబ్బులను ఎలాగైనా రికవరీ చేసుకోవాలన్న దుర్‌ఉద్దేశంతోనే వీరు అక్రమ పనులకు తెరలేపినట్లు సంఘాల మాజీ అధ్యక్షులు, రైతులు సంఘ సభ్యులు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. నిర్మాణ పనుల్లో వచ్చే మిగులు కమిషన్లపై కన్నేసి, ఎలాగైనా ఆ డబ్బులను తొందరగా ఖర్చు చేయాలన్న లక్ష్యంతోనే ముందుకు వెళ్తున్నట్లు తెలుస్తోంది.

**సీఈవోలు, సహకార అధికారులపై భయభ్రాంతులు, ఒత్తిళ్లు**

గత పాలకవర్గాల హయాంలో నిల్వ ఉన్న నిధులను తక్షణమే ఖర్చు చేయాలని సహకార సంఘాల కార్యదర్శులపై పీఐసీ చైర్మన్లు తీవ్ర ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. అప్రూవల్స్ ఇవ్వాలని కోరుతూ జిల్లా సహకార అధికారి ని మరియు ఇతర కోఆపరేటివ్ అధికారులను సైతం భయభ్రాంతులకు గురిచేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అధికార దర్జాను అడ్డం పెట్టుకుని, సహకార రంగాన్ని భ్రష్టుపట్టిస్తున్న ఇలాంటి చైర్మన్ల తీరుపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి విచారణ జరపాలని, నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న పనులను సహకార అధికారులు అడ్డుకోవాలని సంఘ సభ్యులు మరియు సహకార సంఘాల మాజీ అధ్యక్షులు డిమాండ్ చేస్తున్నారు

# జమ్మికుంట మున్సిపాలిటీలో లెక్కలెక్కడ?

- మూలకు పడ్డ చెత్తబండ్లకు కొత్త టైర్లు.. ప్రజాధనం ఖర్చుపై కౌన్సిలర్ ప్రశ్నల వర్షం
- రూ.36 లక్షల వ్యవహారం ఏమైంది? రికవరీ ఎంత.. బాధ్యులపై చర్యలెక్కడ?
- అవినీతిని ప్రశ్నిస్తే నాపైనే ఆరోపణలా?: శ్రీపతి నరేష్‌గౌడ్

**(కరీంనగర్/జమ్మికుంట జోర్దార్ ప్రతినిధి)** జమ్మికుంట మున్సిపాలిటీలో ప్రజాధనం వినియోగం, పారిశుధ్య నిర్వహణ, మున్సిపల్ ఆస్తుల పరిరక్షణపై ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా వినియోగంలో లేకుండా మూలకు పడ్డ చెత్తబండ్లకు కొత్త టైర్లు ఏర్పాటు చేయడం తాజా వివాదానికి దారితీసింది. అవసరం లేని సామగ్రికి ప్రజాధనం ఎందుకు ఖర్చు చేశారనే ప్రశ్నలు కౌన్సిలర్ ఒగ్గు రమేష్‌యాదవ్ లేవనెత్తారు. ఒక్కో చెత్తబండికి ఎంత ఖర్చు చేశారు? ఎన్ని బండ్లకు టైర్లు మార్చారు? టైర్లు ఎక్కడి నుంచి కొనుగోలు చేశారు? ఎంత మొత్తానికి బిల్లులు చెల్లించారు? కొనుగోలు ప్రక్రియ ఎలా సాగింది? అనే వివరాలను అధికారులు వెల్లడించాలని ఆయన కోరారు.

**మూలకు పడ్డ బండ్లకు కొత్త టైర్లు ఎందుకు?**

చాలాకాలంగా వినియోగంలో లేకుండా పక్కన పెట్టిన చెత్తబండ్లకు మరమ్మతులు చేయడం, కొత్త టైర్లు ఏర్పాటు చేయడంపై కౌన్సిలర్ రమేష్‌యాదవ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. పారిశుధ్య నిర్వహణకు అవసరమైన సామగ్రిని సకాలంలో వినియోగంలోకి తీసుకురావడం సమంజసమేనని, అయితే వాడుకలో లేని బండ్లకు ప్రజాధనం ఖర్చు చేయడం వెనుక కారణాలను అధికారులు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

మున్సిపాలిటీలో మొత్తం ఎన్ని చెత్తబండ్లు ఉన్నాయి? ప్రస్తుతం ఎన్ని పనిచేస్తున్నాయి? ఎన్ని మూలకు పడ్డాయి? గతంలో వాటి నిర్వహణకు ఎంత ఖర్చు చేశారు? ప్రస్తుత ఖర్చు ఎంత? వంటి వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.

**రూ.36 లక్షల వ్యవహారం ఏమైంది?**

గతంలో జమ్మికుంట మున్సిపాలిటీలో సుమారు రూ.36 లక్షల ప్రజాధనం దుర్వినియోగమైనట్లు విజిలెన్స్ విచారణకు సంబంధించిన నివేదికలు వెలువడ్డాయని స్థానికులు గుర్తుచేస్తున్నారు. ఈ వ్యవహారం మరోసారి చర్చనీయాంశమైంది. విజిలెన్స్ విచారణలో ఏం తేలింది? ఎంత మొత్తాన్ని దుర్వినియోగంగా గుర్తించారు? ఎంత రికవరీ చేశారు? ఇంకా ఎంత రికవరీ కావాల్సి ఉంది? బాధ్యులుగా ఎవరిని గుర్తించారు? వారిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అనే ప్రశ్నలకు సమాధానాలు కావాలని స్థానికులు కోరుతున్నారు.

**బిల్లులు బయటపెడితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయా?**

చెత్తబండ్ల టైర్ల కొనుగోలు నుంచి గతంలో వెలుగులోకి వచ్చిన ఆర్థిక వ్యవహారాల వరకు పూర్తి రికార్డులను పరిశీలిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని స్థానికులు అంటున్నారు. టైర్ల కొనుగోలు బిల్లులు, సరఫరా సంస్థ వివరాలు, చెల్లింపుల రికార్డులు, చెత్తబండ్ల సంఖ్య, వాటి ప్రస్తుత పరిస్థితి, మరమ్మతులకు సంబంధించిన వర్క్‌ఆర్డర్లు తదితర వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

**ప్రశ్నిస్తే నాపైనే ఆరోపణలా?**

మున్సిపాలిటీలో జరుగుతున్న వ్యవహారాలను ప్రశ్నిస్తున్నందుకే తనను రాజకీయంగా లక్ష్యంగా చేసుకుంటున్నారని శ్రీపతి నరేష్‌గౌడ్ ఆరోపించారు.

మున్సిపాలిటీ నిధుల వినియోగం, పారిశుధ్య విభాగం పనితీరు, ప్రజా సమస్యలపై ప్రశ్నించడం ప్రజాప్రతినిధిగా తన బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజల సొమ్ముకు సంబంధించిన అంశాలపై ప్రశ్నిస్తే తప్పేంటని ఆయన ప్రశ్నించారు.

తనపై చేస్తున్న ఆరోపణలకు ఆధారాలు ఉంటే బహిర్గతం చేయాలని, అవినీతి, అక్రమాలను ప్రశ్నించినందుకే తనను లక్ష్యంగా చేసుకోవడం సరికాదని నరేష్‌గౌడ్ అన్నారు.

ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని ఉద్దేశించి కూడా ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అయితే ఈ ఆరోపణలపై ఎ మ్మెల్యే వైపు నుంచి అధికారిక స్పందన వెలు వడాల్సి ఉంది.

**మహిళా కౌన్సిలర్ల ఆరోపణలపై విచారణ ఎప్పుడు?**

పారిశుధ్య విభాగానికి సంబంధించిన అంశాలపై కమిషనర్‌ను కలిసి ప్రశ్నించిన సమయంలో కొందరు మహిళా కౌన్సిలర్ల పట్ల దురుసుగా ప్రవర్తించారని, ఎస్సీ, ఎస్టీ కేసులు పెడతామని బెదిరించినట్లు మహిళా కౌన్సిలర్లు ఆరోపించారని నరేష్‌గౌడ్ తెలిపారు.

ఎన్నికైన ప్రజా ప్రతినిధులు అధికారులను ప్రశ్నించే సమయంలో ఇలాంటి పరిస్థితులు తలెత్తడం సరికాదన్నారు.

అయితే ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు, సిబ్బంది అధికారికంగా స్పందించాల్సి ఉంది. ఆరోపణల్లో వాస్తవమెంత అన్నది విచారణలో తేలాల్సి ఉంది.

**మున్సిపల్ ఆస్తులపై పూర్తి లెక్కలు కావాలి**

మున్సిపాలిటీకి చెందిన చెత్తబండ్లు, వాహనాలు, పారిశుధ్య పరికరాలు తదితర ఆస్తులపై సమగ్ర జాబితా రూపొందించి వాటి ప్రస్తుత పరిస్థితిని నమోదు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఏవి వినియోగంలో ఉన్నాయి? ఏవి మరమ్మతులకు అనుకూలంగా ఉన్నాయి? ఏవి పూర్తిగా పనికిరావు? అనే వివరాలను నమోదు చేస్తే భవిష్యత్‌లో అనవసర ఖర్చులకు అడ్డుకట్ట వేయవచ్చని అంటున్నారు.

**ప్రతి రూపాయికి లెక్క చెప్పాలి**

మున్సిపాలిటీ ప్రజల నుంచి పన్నులు వసూలు చేస్తుంది. ప్రభుత్వం నుంచి నిధులు పొందుతుంది. ఆ నిధులు ప్రజా అవసరాల కోసమే ఖర్చు చేయాల్సి ఉంటుంది. అందువల్ల ప్రతి రూపాయి ఖర్చుకు లెక్క ఉండాలని స్థానికులు పేర్కొంటున్నారు.

చెత్తబండ్ల టైర్ల వ్యవహారం నుంచి గతంలో వెలుగులోకి వచ్చిన రూ.36 లక్షల ఆర్థిక వ్యవహారం వరకు అన్ని అంశాలపై ఉన్నతాధికారులు సమగ్రంగా విచారణ చేపట్టి వాస్తవాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేస్తున్నారు.

ఆరోపణలు నిజమైతే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, నిరాధారమైతే అధికారిక రికార్డులతో వాటిని ఖండించాలని కోరుతున్నారు. రాజకీయ ఆరోపణలు--ప్రత్యారోపణలకు తావు లేకుండా ప్రజాధనం వినియోగంలో పూర్తి పారదర్శకత కల్పించాల్సిన అవసరం ఉందని స్థానికులు స్పష్టం చేస్తున్నారు.

## కిలా వరంగల్ మండలంలో ఉపాధ్యాయుల సర్దుబాటులో కొన్ని విచిత్రాలు 2

- పొరపాట్లకు ఎం ఈ ఓ అవగాహన రాహిత్యమా?
- ఎవరైనా తప్పు దోవ పట్టించారా?
- అనుభవజ్ఞుడైన షాడో ఎమ్.ఈ.ఓ మొత్తం చక్రం తిప్పినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.
- వరంగల్ కలెక్టర్ గారు జర దేకో
- ఎం.ఈ.ఓ. సన్నిహిత ప్రైమరీ హెడ్మాస్టర్ పాత్ర ఏమిటి?
- సంఘ నాయకులుగా చలామణి అయ్యే హెడ్ మాస్టర్ల పాత్ర ఎంత?



**(వరంగల్ జోర్దార్ బృందం)**

1. బాంబే రైస్ మిల్ లో ఒకటి నుంచి ఆరు తరగతులకు 180 మంది విద్యార్థులకు ముగ్గురు ఎస్జీటీలే ఉన్నప్పటికీ అక్కడ అవసరానికి సరిపడా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయకుండా, 11 మంది పిల్లలు, 15 మంది పిల్లలు ఉన్న పాఠశాలలకు అదనంగా ఇంకొక ఉపాధ్యాయున్ని కేటాయించారు మిడిల్ ఫోర్ట్, రైల్వే గేట్, శంభునపేట పీఎస్ లలో అవసరానికి మించి ఉన్న ఉపాధ్యాయులను సర్దుబాటులో పరిగణలోకి తీసుకోలేదు.

2. యుపిఎస్ ఎస్ఆర్ఆర్ తోటలో గత సంవత్సరం సర్దుబాటులో భాగంగా పనిచేస్తున్న తెలుగు ఉపాధ్యాయురాలిని వరంగల్ మండలంలోని పాఠశాలకు కేటాయించి ఖిలా వరంగల్ మండలానికి చెందిన షాడో ఎమ్ఈఓ పనిచేస్తున్న పాఠశాల ఉపాధ్యాయున్ని కేటాయించారు ఈ క్రమంలో ఆ పాఠశాలకు హిందీ ఉపాధ్యాయున్ని కేటాయించకుండా,అక్కడ ఉన్న ఉపాధ్యాయున్ని సంగం మండలానికి కేటాయించారు అక్కడ పనిచేస్తున్న గణిత ఉపాధ్యాయుని తన మాతృ పాఠశాలలో అవసరం లేకున్నా వెనక్కి పంపించి వేరే ఉపాధ్యాయురాలిని కేటాయించారు.

3. బాంబే రైస్ మిల్ పాఠశాలలో అవసరానికి సరిపడా స్కూల్ అసిస్టెంట్లను కేటాయించకుండా పాఠశాల నిర్వహణ క్లిష్టంగా మరేలా చేశారు.

4. వరంగల్ జిల్లాలోని 13 మండలాలలో వరంగల్, కిలా వరంగల్ మండలాలలోని విద్యార్థుల సంఖ్య మిగిలిన 11 మండలాలలోని మొత్తం విద్యార్థుల సంఖ్య కంటే ఎక్కువ అయినప్పటికీ సర్దుబాటులో ఈ రెండు మండలాలను చిన్నచూపు చూస్తూ సరిపడా ఉపాధ్యాయులను కేటాయించలేదు

# మాదారంలో విషాదం

## గుండెపోటుతో ఆర్ఎంపీ వైద్యుడు మృతి..!



సింగరేణి మండల పరిధిలోని మాదారం గ్రామానికి చెందిన గ్రామీణ వైద్యుడు పుల్లారావు (42) గుండెపోటుతో మృతి చెందాడు. ఆదివారం సాయంత్రం హార్ట్ ఎటాక్ రావడంతో ఆయన మరణించాడు.

రెండు దశాబ్దాలుగా వైద్య సేవలందించిన పుల్లారావు అంత్యక్రియలు సోమవారం నిర్వహించనున్నారు.

స్వస్థలం పెద్దమండవలో సోమవారం అంత్యక్రియలు చేపడతామని కుటుంబ సభ్యులు తెలిపారు.

ముదిగొండ మండలం పెద్దమండవకు చెందిన పుల్లారావు పాతికేళ్ల కిందట మాదారం గ్రామానికి వచ్చి ఆర్ఎంపి వైద్యుడిగా పని చేస్తున్నాడు.

అందరితో కలుపుగోలుగా ఉంటూ.. వైద్యం చేసిన పుల్లారావు గుండెపోటుతో మరణించడం అందర్నీ షాక్‌కు గురి చేసింది. ఆయన మృతితో మాదారం గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

సర్పంచ్ ఉమా నరేష్‌తో పాటు గ్రామస్తులు పుల్లారావుకు నివాళులర్పించారు.

దాదాపు రెండున్నర దశాబ్దాల పాటు మాదారం పరిసర ప్రాంతాలలో ప్రజలకు వైద్య సేవనందించిన పుల్లారావు ఆకస్మిక మరణం తీరని లోటని పలువురు అతని కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.

మృతుని స్వగ్రామం పెద్ద మండవలో సోమవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు

# మళ్లీ వస్తున్న అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్

## ఎప్పటి నుంచో తెలుసా..?

పండగ సీజన్ సమీపిస్తుండటంతో ఆన్‌లైన్ షాపింగ్ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న "అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ 2026 రాబోతోంది. ఫెస్ట్‌కు సంబంధించిన తేదీలను ఆ సంస్థ అధికారికంగా ప్రకటించింది. ఈ ఏడాది అతిపెద్ద సేల్‌గా అభివర్ణిస్తున్న ఈ ఫెస్టివల్ అక్టోబర్ 8 నుంచి ప్రారంభం కానుంది.

మరో ఈ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ తన "బిగ్ బిలియన్ డేస్ 2026" సేల్‌ను అక్టోబర్ 9న ప్రారంభించనున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో, అమెజాన్ వ్యూహాత్మకంగా ఒకరోజు ముందే తన సేల్‌ను మొదలుపెట్టి పోటీకి సై అంటోంది.

ఈ సేల్‌లో భాగంగా ఎస్‌బీఐ డెబిట్, క్రెడిట్ కార్డులతో కొనుగోళ్లు చేసేవారికి 10% తక్షణ డిస్కౌంట్ లభించనుంది. ఈఎంఐ లావాదేవీలకు కూడా ఈ ఆఫర్ వర్తిస్తుందని అమెజాన్ స్పష్టం చేసింది. ప్రైమ్ మెంబర్లకు కొన్ని ఎంపిక చేసిన ఆఫర్లపై అదనంగా 10% వరకు ప్రయోజనాలు ఉండనున్నాయి.




వీటితోపాటు స్మార్ట్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్స్, ఫ్యాషన్, గృహోపకరణాలు, నిత్యావసరాలు వంటి అన్ని కేటగిరీలపై భారీ డిస్కౌంట్లు అందుబాటులో ఉంటాయి. బ్లాక్‌బస్టర్ డీల్స్, టాప్ 100 డీల్స్, మెగా డీల్స్, రాత్రి 8 గంటల డీల్స్ వంటి ప్రత్యేక ఆఫర్లతో వినియోగదారులను ఆకట్టుకునేందుకు అమెజాన్ సిద్ధమైంది. కేవలం డిస్కౌంట్లే కాకుండా ఈసారి షాపింగ్ అనుభవాన్ని మెరుగుపరిచేందుకు అమెజాన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత ఫీచర్లను ప్రవేశపెడుతోంది. వీటి ద్వారా వినియోగదారులు ఉత్పత్తులను సులభంగా పోల్చుకోవచ్చు, ధరల హెచ్చుతగ్గుల చరిత్రను చూడవచ్చు, మెరుగైన సిఫార్సులను పొందవచ్చు.

దేశవ్యాప్తంగా వేగవంతమైన డెలివరీని అందించే లక్ష్యంతో తన లాజిస్టిక్స్ నెట్‌వర్క్‌ను భారీగా విస్తరించింది.

ఇందులో భాగంగా 20 కొత్త ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్లు, 6 కొత్త సార్ట్ సెంటర్లు, 150 కొత్త లాస్ట్-మైల్ స్టేషన్లను ఏర్పాటు చేసింది. దీపావళి నాటికి "అమెజాన్ నౌ" (నిత్యావసరాల క్విక్ కామర్స్) సేవలను 100 నగరాలకు విస్తరించాలని అమెజాన్ లక్ష్యంగా పెట్టుకుంది.

ప్రస్తుతం తమ ప్లాట్‌ఫామ్‌పై 17 లక్షల మందికి పైగా విక్రయదారులు ఉన్నారని, వీరి సంఖ్య 20 లక్షల మైలురాయిని దాటిందని కంపెనీ పేర్కొన్నది.

సేల్ ఎప్పటివరకు కొనసాగుతుందనే విషయం ఇంకా వెల్లడి కాలేదు

# పాలిటెక్నిక్ విలీనంపై యూటర్న్

## విద్యార్థుల ఉద్యమంతో దిగొచ్చిన సర్కార్..!

యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో పాలిటెక్నిక్ విలీనం ప్రతిపాదనపై కాంగ్రెస్ ప్రభుత్వం యూటర్న్ తీసుకుంది. జీవో 97ను నిరసిస్తూ విద్యార్థి లోకం నిర్వహించిన 37 రోజుల ఉద్యమంతో సర్కార్ దిగొచ్చింది. దాంతో, వీలీనం నిర్ణయానికి బ్రేక్ పడింది. శక్తి శాఖలో ఉద్యోగుల కేటాయింపు విషయం కూడా ఇక్కడితో ముగిసినట్టే.

యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో పాలిటెక్నిక్ విలీనం కోసం జూలై 3వ తేదీన విడుదల చేసిన 97 జీవోపై విద్యార్థి, అధ్యాపక లోకం భగ్గుమనడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది.

శక్తి శాఖలో ఉద్యోగుల కేటాయింపు అంశంపై కూడా తీవ్ర నిరసను వ్యక్తమవ్వడంతో.. కేకే కమిటీ పరిస్థితులపై సీఎం రేవంత్ రెడ్డికి నివేదిక అందించింది.దాంతో, పాలిటెక్నిక్ విలీనం ప్రతిపాదనపై సర్కార్ యూటర్న్ తీసుకుంది.

కాబట్టి పాత పద్ధతిలోనే డిప్లొమా విద్య.. సాంకేతిక విద్యాశాఖ పరిధిలోనే కాలేజీల కొనసాగనున్నాయి.

అలానే సాంకేతిక విద్యామండలి, ఏఐసీటీఈ విధానాలు యథాత థంగా ఉండను న్నాయి.

దాంతో, 37 రోజుల విద్యార్థులు, అధ్యాపకుల పోరాటానికి ఫలితం దక్కింది

# తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల సర్వీస్ రూల్స్

తెలంగాణ ప్రభుత్వ ఉపాధ్యాయులు ఎలాంటి వాణిజ్య కార్యక్రమాలలో పాల్గొనకుండా, లేదా వాటిని నిర్వహించకుండా నిరోధించే సర్వీసు నిబంధనలు మరియు సెక్షన్ల పూర్తి వివరాలు తెలుగులో క్రింద ఇవ్వబడ్డాయి:
తెలంగాణ ప్రభుత్వోద్యోగుల వలెనే ఉపాధ్యాయులకు కూడా తెలంగాణ సివిల్ సర్వీసెస్ (ప్రవర్తన) నిబంధనలు – 1964 1964రి మరియు సివిల్ సర్వీసెస్ (వర్గీకరణ, నియంత్రణ మరియు అప్పీలు) నిబంధనలు – 1991 1991రి పూర్తిగా వర్తిస్తాయి.

**సెక్షన్ల వారీగా నిబంధనలు**

**1. ప్రైవేట్ వ్యాపారాలు లేదా వాణిజ్య కార్యకలాపాల నిషేధం (రూల్ 9)**

**నిబంధన వివరాలు:** ప్రభుత్వ ఉపాధ్యాయులు ఎవరూ కూడా ప్రభుత్వ ముందస్తు అనుమతి లేకుండా ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఏ విధమైన సొంత వ్యాపారం, వాణిజ్యం లేదా ఇతర ఉపాధిని చేపట్టరాదు.

**వాణిజ్య కార్యక్రమాలకు వర్తింపు:** వాణిజ్య సంస్థలు లేదా ప్రైవేట్ కంపెనీలు నిర్వహించే వ్యాపార ప్రచారాలు, కార్పొరేట్ ఈవెంట్లు, లేదా ప్రాఫిట్-డ్రైవెన్ (లాభాపేక్షతో కూడిన) కార్యక్రమాలకు హోస్ట్‌లుగా, ఆర్గనైజర్లుగా లేదా ప్రమోటర్లుగా వ్యవహరించడం ఈ రూల్‌కు విరుద్ధం.

**2. కంపెనీల నిర్వహణ మరియు ప్రమోషన్లపై ఆంక్షలు (రూల్ 9 ఉప-నిబంధనలు)**

ప్రభుత్వ ఉద్యోగులు ఎవరూ కూడా బ్యాంకులు లేదా ప్రైవేట్ వాణిజ్య సంస్థల రిజిస్ట్రేషన్, ప్రమోషన్ లేదా నిర్వహణలో పాలుపంచుకోకూడదు. ఉపాధ్యాయులు వాణిజ్య సంస్థల ఈవెంట్లకు బ్రాండ్ అంబాసిడర్లుగా లేదా నిర్వాహకులుగా ఉండటం నిషేధించబడింది.

**3. పూర్తికాలపు ఉద్యోగం మరియు విధి పట్ల అంకితభావం (రూల్ 3)**

**డ్యూటీ సమయాల్లో:** పాఠశాల వేళల్లో లేదా విధి నిర్వహణ సమయంలో బయట వాణిజ్య కార్యక్రమాలకు వెళ్లడం అనేది "అధికారిక విధులకు గైర్హాజరు" మరియు బాధ్యతారాహిత్యంగా పరిగణించబడుతుంది.

**డ్యూటీ సమయం తర్వాత కూడా:** ఉపాధ్యాయులు పబ్లిక్ సర్వెంట్లు కాబట్టి, డ్యూటీ గంటలు ముగిసిన తర్వాత కూడా ప్రభుత్వ ఉద్యోగ ప్రతిష్టకు భంగం కలిగించే వాణిజ్య కార్యక్రమాలలో పాల్గొనరాదు.

**4. స్పాన్సర్‌షిప్‌లు మరియు ఆర్థిక లావాదేవీలపై నిషేధం**

వాణిజ్య సంస్థల నుండి ఆర్థిక లబ్ధి పొందడం, వాణిజ్య ఈవెంట్ల కోసం ప్రైవేట్ వ్యక్తుల నుండి స్పాన్సర్‌షిప్‌లు సేకరించడం నిబంధనల ప్రకారం నేరం.

**క్రమశిక్షణా చర్యలు మరియు వర్తించే కేసులు 1991)**

ప్రభుత్వ అనుమతి లేకుండా ఉపాధ్యాయులు వాణిజ్య కార్యక్రమాలను నిర్వహిస్తే లేదా వాటిలో పాల్గొంటే టెన్సెల తెలంగాణ సివిల్ సర్వీసెస్ రూల్స్-1991 ప్రకారం చర్యలు తీసుకుంటారు

**అధికారులు:** జిల్లా విద్యాశాఖ అధికారి లేదా రీజినల్ జాయింట్ డైరెక్టర్ వీరికి వ్యతిరేకంగా విచారణ జరిపి చర్యలు తీసుకుంటారు.

**శిక్షలు**

**చిన్నశిక్షలు:**నిబంధనలను మొదటిసారి ఉల్లంఘిస్తే మెమోలు ఇవ్వడం, సెన్సూర్ చేయడం లేదా ఇంక్రిమెంట్లు తాత్కాలికంగా నిలిపివేయడం జరుగుతుంది.

**పెద్ద శిక్షలు :** పాఠశాల వేళల్లో లేదా ఆ తర్వాత అనధికారికంగా కమర్షియల్ కోచింగ్ సెంటర్లు నడపడం, మల్టీ-లెవెల్ మార్కెటింగ్ లేదా వాణిజ్య వ్యాపారాలు చేస్తూ పట్టుబడితే ఇంక్రిమెంట్లు శాశ్వతంగా నిలిపివేయడం, సర్వీసు నుండి తప్పించడం లేదా సర్వీసు నుండి డిస్మిస్ చేయడం వంటి తీవ్రమైన చర్యలు ఉంటాయి.

**గమనిక:** ఉపాధ్యాయులు ఏదైనా సామాజిక, సాహిత్యపరమైన లేదా సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనాలన్నా, డ్యూటీ సమయం వెలుపల వాటికి హాజరు కావాలన్నా సంబంధిత విద్యాశాఖ అధికారి నుండి ముందస్తు రాతపూర్వక అనుమతి పొందడం తప్పనిసరి.
తెలంగాణలోని ప్రభుత్వ ఉపాధ్యాయుల ప్రవర్తనను నియంత్రించే చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్---ముఖ్యంగా వాణిజ్య కార్యకలాపాలు, ప్రైవేట్ వ్యాపారాలు మరియు ఈవెంట్లకు సంబంధించి---తెలంగాణ సివిల్ సర్వీసెస్ (ప్రవర్తన) నిబంధనలు, 1964 (ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నిబంధనల నుండి తెలంగాణ స్వీకరించినవి) నుండి తీసుకోబడింది మరియు దీనిని తెలంగాణ విద్యా చట్టం మరియు సంబంధిత సేవా మార్గదర్శకాలతో కలిపి వర్తింపజేస్తారు.
వాణిజ్య సంబంధాలకు సంబంధించి ప్రభుత్వ ఉపాధ్యాయులకు నిర్దిష్టంగా వర్తించే నిబంధనలు మరియు క్లాజులు క్రింది విధంగా ఉన్నాయి

**1. ప్రైవేట్ వ్యాపారం, ఉపాధి మరియు ట్యూషన్లపై నిర్దిష్ట నిబంధనలు (ప్రవర్తనా నియమావళి రూల్ 9)**

**రూల్ 9(1) - ప్రైవేట్ వ్యాపారం లేదా వాణిజ్య నిషేధం:** ప్రభుత్వ ముందస్తు అనుమతి లేకుండా ఏ ఉపాధ్యాయుడు కూడా ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఏ విధమైన వ్యాపారంలో, వాణిజ్యంలో లేదా ఇతర ఉపాధిలో పాల్గొనకూడదు.

**వాణిజ్య ఈవెంట్లు ఉ కార్యక్రమాలకు వర్తింపు:** వాణిజ్య ప్రదర్శనలు, ట్రేడ్ ఎక్స్‌పోలు, ఉత్పత్తి ప్రకటనలు (ప్రొడక్ట్ ఎండార్స్‌మెంట్‌లు), లేదా లాభాపేక్షతో కూడిన వ్యాపార కార్యక్రమాలను నిర్వహించడం, వాటికి ముఖ్య అతిథిగా వ్యవహరించడం లేదా వృత్తిపరంగా పాల్గొనడాన్ని అనధికారిక "ఇతర ఉపాధి" లేదా వాణిజ్య వ్యాపారంగా పరిగణిస్తారు.

**వాణిజ్య ట్యూషన్లు / కోచింగ్ అకాడమీలపై కఠిన నిషేధం:** రూల్ 9 అనేది సమాంతరంగా వాణిజ్య కోచింగ్ సంస్థలు, కార్పొరేట్ ట్యుటోరియల్స్ లేదా లాభం కోసం ప్రైవేట్ అకడమిక్ వ్యాపారాలను నడిపే ఉపాధ్యాయులను గట్టిగా లక్ష్యంగా చేసుకుంటుంది. తెలంగాణ విద్యా సేవా మార్గదర్శకాల ప్రకారం, స్పష్టమైన మరియు అరుదైన ప్రభుత్వ అనుమతి లేకుండా పాఠశాల వేళల వెలుపల కూడా ప్రభుత్వ ఉపాధ్యాయులు వాణిజ్య ప్రైవేట్ ప్రాక్టీస్ లేదా ట్యూషన్లలో పాల్గొనడాన్ని ఖచ్చితంగా నిషేధించారు.

**2. కంపెనీలు లేదా ఆర్థిక సాహసాలను ప్రోత్సహించడంపై ప్రత్యక్ష ఆంక్షలు (రూల్ 9 ఉప-నిబంధనలు)**

ఉపాధ్యాయులు ఏ బ్యాంకు, కార్పొరేట్ సంస్థ, మల్టీ-లెవెల్ మార్కెటింగ్ (మీఎవీ) పథకం లేదా వాణిజ్య సంస్థ యొక్క ప్రమోషన్, రిజిస్ట్రేషన్ లేదా నిర్వ వేతనం పొందే హోస్ట్ లేదా వాణిజ్య బ్రాండ్ ప్రమోటర్‌గా వ్యవహరిస్తున్నట్లు తేలితే, ఆసక్తి ఘర్షణ మరియు పబ్లిక్ హోదాను దుర్వినియోగం చేసినట్లుగా ఈ ఉప-సెక్షన్ కింద నేరంగా పరిగణించి చర్యలు తీసుకుంటారు.

**3. విధి పట్ల సంపూర్ణ అంకితభావం మరియు ప్రజా ప్రతిష్ట (ప్రవర్తనా నియమావళి రూల్ 3)**

రూల్ 3(1) సంపూర్ణ సమగ్రతను మరియు విధి పట్ల అంకితభావాన్ని కోరుతుంది. ఉపాధ్యాయుల విషయానికి వస్తే, వారి వృత్తిపరమైన దృష్టి కేవలం సంస్థాగత బోధన, పాఠ్యప్రణాళిక అమలు మరియు కేటాయించిన పాఠశాల విధులపైనే మాత్రమే ఉండాలని దీని అర్థం.

**ప్రభుత్వ ఉద్యోగికి తగని ప్రవర్తన:** ఆర్భాటమైన వాణిజ్య ఈవెంట్లు, వాణిజ్య స్టేజ్ షోలు లేదా ప్రమోషనల్ కార్యక్రమాలలో పాల్గొనడం---డ్యూటీ సమయం ముగిసిన తర్వాత కూడా---ఉపాధ్యాయ వృత్తికి కళంకం తెస్తుంది. రూల్ 3 ప్రకారం, ప్రజా దృష్టిలో ప్రభుత్వ ఉద్యోగి ప్రతిష్టను తగ్గించే ఏ చర్య అయినా చట్టపరంగా "దుష్ప్రవర్తన" కింద శిక్షార్హమైనది.

**4. చందాలు, నిధులు మరియు ఆర్థిక సేకరణలపై పరిమితులు (ప్రవర్తనా నియమావళి రూల్ 12)**

వాణిజ్య ఈవెంట్లు లేదా పబ్లిక్ కార్యక్రమాలలో తరచుగా స్పాన్సర్‌షిప్‌లు, టికెట్ విక్రయాలు లేదా వాణిజ్య సేకరణలు ఉంటాయి.
ప్రవర్తనా నియమావళి రూల్ 12 ప్రకారం ప్రభుత్వ ఉద్యోగులు అధికారిక అనుమతి లేకుండా ఏ ప్రయోజనం కోసమైనా విరాళాలు కోరడం, అంగీకరించడం లేదా చందాలు/నిధులు సేకరించడాన్ని నిషేధిస్తుంది. ఒక ఉపాధ్యాయుడు వాణిజ్య కార్యక్రమాన్ని నిర్వహించి, వ్యాపారాల నుండి నిధులు, స్పాన్సర్‌షిప్‌లు లేదా ప్రకటనలను సేకరించడానికి తన పాఠశాల హోదాను ఉపయోగించుకుంటే, వారు ఈ నిర్దిష్ట నిబంధనను ఉల్లంఘించినట్లే.
రూల్స్, 1991 ప్రకారం అమలు మరియు క్రమశిక్షణా చర్యలు
తెలంగాణ ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఈ నిర్దిష్ట నిబంధనలను ఉల్లంఘించినప్పుడు, తెలంగాణ సివిల్ సర్వీసెస్ (వర్గీకరణ, నియంత్రణ మరియు అప్పీలు) నిబంధనలు – 1991 ద్వారా చర్యలు తీసుకోబడతాయి.

**విచారణ ప్రారంభమ్:** జిల్లా విద్యాశాఖ అధికారి (ఇజఖా) సీసీఏ నిబంధనల రూల్ 20 కింద అధికారిక ఛార్జ్ మెమోను జారీ చేసి, అనధికార వాణిజ్య ఈవెంట్లు లేదా ప్రైవేట్ వ్యాపారంలో పాల్గొన్నందుకు రాతపూర్వక వివరణ కోరతారు.

**విధించే శిక్షలు:**

**వాణిజ్య ఈవెంట్లలో పాల్గొనడం / నిర్వహించడం లేదా అనధికార కార్యక్రమాల కోసం:** సెన్సూర్ లేదా ఇంక్రిమెంట్లు నిలిపివేయడం (క్యుములేటివ్ ప్రభావం లేకుండా) వంటి చిన్న శిక్షలను సాధారణంగా వర్తింపజేస్తారు.
సేవలో ఉంటూ వాణిజ్య కోచింగ్ సెంటర్లు, సమాంతర వ్యాపారాలు లేదా పెద్ద వాణిజ్య సంస్థలను నడుపుతున్నట్లయితే: శాఖాపరమైన విచారణ తర్వాత బలవంతపు పదవీ విరమణ తొలగింపు లేదా సేవ నుండి పూర్తిగా డిస్మిస్ చేయడం వంటి పెద్ద శిక్షలను విధిస్తారు.
సాంస్కృతిక లేదా సాహిత్య కార్యక్రమాలలో పాల్గొనేందుకు ఉపాధ్యాయులు ప్రభుత్వ అనుమతిని కోరే విధానం లేదా అనుసరించాల్సిన పద్ధతి తెలుగులో క్రింద ఇవ్వబడింది.
తెలంగాణ సివిల్ సర్వీసెస్ (ప్రవర్తన) నిబంధనల ప్రకారం, ఉపాధ్యాయులు తమ అధికారిక విధులకు భంగం కలగకుండా అప్పుడప్పుడు సాహిత్య, కళాత్మక, శాస్త్రీయ లేదా సాంస్కృతిక కార్యకలాపాలలో పాల్గొనేందుకు వెసులుబాటు ఉంది. అయితే నిబంధనలకు లోబడి ఉండటానికి కొన్ని నిర్దిష్ట పద్ధతులు పాటించాలి.
అనుమతి కోరే లేదా సమాచారం ఇచ్చే విధానం ఒక ప్రభుత్వ ఉపాధ్యాయుడు పుస్తక ప్రచురణ, ప్రముఖ సాంస్కృతిక/సాహిత్య కార్యక్రమాలలో నిర్వాహకుడిగా పాల్గొనడం, పారితోషికం తీసుకోవడం లేదా రిజిస్టర్డ్ సాంస్కృతిక/సాహిత్య సంఘంలో సభ్యత్వం/పదవి తీసుకోవాలనుకున్నప్పుడు ఈ క్రింది పద్ధతిని పాటించాలి.

**1. సరైన ఛానెల్ ద్వారా వ్రాతపూర్వక దరఖాస్తు ఉపాధ్యాయుడు ఈ కార్యకలాపాలను ప్రారంభించడానికి ముందే ఒక అధికారిక వ్రాతపూర్వక దరఖాస్తును సమర్పించాలి.**

**ఛానెల్:** ఈ దరఖాస్తు నేరుగా పై అధికారులకు కాకుండా, సరైన మార్గంలో---అంటే ముందుగా మీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ద్వారా, జిల్లా విద్యాశాఖ అధికారి లేదా సంబంధిత సమర్థ అధికార వర్గానికి చేరాలి. నిబంధనలను పాటించకుండా నేరుగా ఉన్నతాధికారులకు దరఖాస్తు చేయడం క్రమశిక్షణా రాహిత్యం కిందకు వస్తుంది.

**2. దరఖాస్తులో ఉండవలసిన వివరాలు**

వ్రాతపూర్వక అభ్యర్థనలో ఈ క్రింది అంశాలు స్పష్టంగా ఉండాలి:

**వ్యక్తిగత వివరాలు:** పేరు, హోదా, పాఠశాల/ప్రాంతం మరియు ఎంప్లాయ్ ఐడీ కోడ్

**కార్యకలాపాల స్వభావం:** ఈవెంట్ లేదా పని సాహిత్యపరమైనదా, కళాత్మకమైనదా, శాస్త్రీయమైనదా లేదా సాంస్కృతికమైనదా అని స్పష్టంగా తెలపాలి.

**ఉపాధ్యాయుని పాత్ర:** రచయితగా, అప్పుడప్పుడు మాట్లాడే వక్తగా, పాల్గొనే వ్యక్తిగా లేదా రిజిస్టర్డ్ సాంస్కృతిక సంఘంలో బాధ్యత వహించే వ్యక్తిగా ఉంటున్నారా అనేది స్పష్టం చేయాలి.

**సమయ కేటాయింపు:** ఈ కార్యకలాపాలు పూర్తిగా పాఠశాల వేళల వెలుపల మాత్రమే జరుగుతాయని మరియు అధికారిక బోధనా విధులకు ఎటువంటి ఆటంకం కలిగించవని డిక్లరేషన్ ఇవ్వాలి.

**ఆర్థిక వివరాలు (పారితోషికం):** ఏవైనా ఫీజులు, రాయల్టీలు లేదా ద్రవ్య లాభాలు ఆశిస్తున్నట్లయితే వాటిని ముందుగానే ప్రకటించాలి. ప్రైవేట్ సంస్థ నుండి క్రమం తప్పకుండా ఫీజు లేదా వాణిజ్య పరిహారం తీసుకోవాలంటే సాధారణంగా ప్రభుత్వ స్పష్టమైన అనుమతి అవసరం.

**3. సాధారణ మినహాయింపులు (ఎప్పుడు ముందస్తు అనుమతి అవసరం లేదు?)**

**ప్రవర్తనా నియమావళి ప్రకారం, పూర్తిగా సాహిత్య, కళాత్మక లేదా శాస్త్రీయ స్వభావం గల అరుదైన/అక్కడికక్కడే చేసే పనులు (ఉదాహరణకు:** కవిత రాయడం, రీసెర్చ్ పేపర్ ప్రచురించడం, రేడియో లేదా సాంస్కృతిక చర్చ లలో అప్పుడప్పుడు పాల్గొనడం) లేదా సామాజిక/ధార్మిక సేవలు చేయడం వంటి వాటికి ముందస్తు అనుమతి అవసరం లేదు, కాకపోతే అవి అధికారిక విధులకు ఆటంకం కలిగించకూడదు.అయితే, ఉపాధ్యాయుడు ఒక పుస్తకాన్ని ప్రచురించాలని ప్లాన్ చేసినా (పాఠశాల విద్యాశాఖ నిబంధనలకు లోబడి ఉండే సాధారణ టెక్స్ట్ బుక్స్ కాకుండా) లేదా సాంస్కృతిక సంఘంలో ఎగ్జిక్యూటివ్ పదవిని చేపట్టాలని చూస్తే ముందస్తు సమాచారం లేదా అనుమతి తప్పనిసరి.

**4. ఈవెంట్ పూర్తయిన తర్వాత పాటించాల్సిన నిబంధనలు**

ఒకవేళ ఉపాధ్యాయుడు రిజిస్టర్డ్ సాహిత్య, సాంస్కృతిక లేదా రిక్రియేషనల్ క్లబ్/సొసైటీ నిర్వహణలో లేదా ప్రమోషన్‌లో చేరితే, ఆ సంఘంలో చేరిన ఒక నెలలోగా ప్రభుత్వానికి/డిపార్ట్‌మెంట్‌కు తన భాగస్వామ్యానికి సంబంధించిన పూర్తి వివరాలను తెలియజేయాలి చేయాలి).

**ముఖ్యమైన గమనిక:** ఒక కార్యక్రమం పూర్తిగా వాణిజ్యేతరమైనది సాంస్కృతికమైనది లేదా సాహిత్యపరమైనది అయి ఉండి, పాఠశాల వేళల వెలుపల గౌరవప్రదంగా నిర్వహిస్తే దాన్ని సానుకూలంగా చూస్తారు---అయితే ఇజఖా కి పూర్తి పారదర్శకతతో సమాచారం ఇవ్వాలి. అదే సాంస్కృతిక లేదా సాహిత్య కార్యక్రమం కాస్తా వాణిజ్య వెంచర్ టికెట్ షో లేదా బ్రాండ్-స్పాన్సర్డ్ ఈవెంట్‌గా మారితే, ఆ మినహాయింపు రద్దు అవుతుంది మరియు తక్షణమే 'రూల్ 9' నిబంధనలు వర్తిస్తాయి.

**రావుల రాజేశం**
**జర్నలిస్టు కవి వ్యాసకర్త ఉపన్యాసకులు**
**7780185 674**

## తీర్థయాత్రలో తప్పిపోయిన వృద్ధుడు
## కుటుంబంతో కలిపిన చాట్‌జీపీటీ




**చండీగఢ్:** ఒక వృద్ధుడు తీర్థయాత్రకు వెళ్లి తప్పిపోయాడు. మతిమరుపు ఉన్న ఆయన రైలులో మరో రాష్ట్రానికి చేరుకున్నాడు. ఆ వృద్ధుడి దీనస్థితిని గమనించిన ఒక వ్యక్తి సహాయానికి ముందుకు వచ్చాడు.
చాట్‌జీపీటీ ద్వారా ఆయన గ్రామం ఎక్కడ ఉన్నదో తెలుసుకున్నాడు. ఆ వృద్ధుడ్ని స్వయంగా తీసుకెళ్లి కుటుంబానికి అప్పగించాడు. పంజాబ్‌లోని లూధియానా జిల్లా ఫతేగఢ్ గుజ్రాన్ గ్రామానికి చెందిన చమన్ లాల్, ప్రభుత్వం అమలు చేస్తున్న 'ముఖ్యమంత్రి తీర్థయాత్ర పథకం' కింద హర్మందిర్ సాహిబ్‌ను సందర్శించేందుకు సెప్టెంబర్ 11న అమృత్‌సర్ చేరుకున్నాడు.
కాగా, మతిమరుపు ఉన్న ఆ వృద్ధుడు తన బృందం నుంచి విడిపోయాడు. అమృత్‌సర్ రైల్వే స్టేషన్ చేరుకున్న ఆయన బీహార్ వెళ్లే రైలు ఎక్కాడు. 1200 కిలోమీటర్లకు పైగా ప్రయాణించి గయకు చేరుకున్నాడు. అయితే అక్కడి రైల్వే స్టేషన్‌లో దీనస్థితిలో ఉన్న చమన్ లాల్‌ను స్థానికుడైన నీరజ్ అనే వ్యక్తి గమనించాడు. ఆ వృద్ధుడు ఆందోళనతో, ఆకలితో ఉన్నట్లు కనిపించడంతో తన ఇంటికి తీసుకెళ్లాడు. నిర్మాణ రంగంలో పనిచేస్తున్న నీరజ్, ఆ వృద్ధుడికి ఆహారం ఇచ్చి నాలుగు రోజుల పాటు ఆశ్రయం కల్పించాడు.
మరోవైపు చమన్ లాల్ నుంచి వివరాలు తెలుసుకునేందుకు నీరజ్ ప్రయత్నించాడు. అయితే మతిమరుపు ఉన్న ఆ వృద్ధుడు తన గ్రామం పేరు 'ఫతేగఢ్ గుజ్రాన్' అని పంజాబీలో చెప్పాడు. నీరజ్‌కు పంజాబ్ తెలియకపోవడంతో ఆ గ్రామం ఎక్కడ ఉన్నదో అన్నది ఇంటర్నెట్‌లో సెర్చ్ చేశాడు. చివరకు చాట్‌జీపీటీలో వెతకడంతో లూధియానా జిల్లాలోని మచ్చివారా సాహిబ్ సమీపంలో ఆ గ్రామం ఉన్నట్లు తెలుసుకున్నాడు.
అయితే వృద్ధుడు, మతిమరుపు ఉన్న చమన్ లాల్‌ను ఒంటరిగా పంపడానికి నీరజ్ మనసు అంగీకరించలేదు. దీంతో ఆయనను తీసుకుని గయా నుంచి లూధియానాకు స్వయంగా రైలులో ప్రయాణమయ్యాడు. అక్కడి నుంచి మచ్చివారాకు వారు చేరుకున్నాడు. చమన్ లాల్‌ను ఎవరైనా గుర్తుపడతారేమోనన్న ఆశతో కనిపించినవారికి ఆయన ఫొటో చూపించాడు.
చివరకు ఆ ప్రాంతానికి చెందిన మాస్టర్ కృష్ణన్ లాల్ అనే వ్యక్తి ఆ వృద్ధుడిని గుర్తించి ఆయన కుటుంబానికి సమాచారం ఇచ్చాడు.
కాగా, చమన్ లాల్ మనవడు సుఖ్‌చైన్ సింగ్ హుటాహుటిన మచ్చివారాకు చేరుకున్నాడు. ఆ వృద్ధుడు తన తాత అని నీరజ్‌కు చెప్పాడు. ఆయన కోసం తమ కుటుంబ సభ్యులు వెతుకుతున్నారని, పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపాడు.
నీరజ్‌ను కూడా తమ ఇంటికి తీసుకెళ్లి పూల మాలలతో ఆహ్వానించారు.
చమన్ లాల్‌ను క్షేమంగా తీసుకువచ్చినందుకు ఆయన కుటుంబ సభ్యులు ఎంతో సంతోషించారు.
నీరజ్‌కు బట్టలు, డబ్బులు బహూకరించి తమ కృతజ్ఞ తను చాటుకున్నారు

## ఆ వదంతులు నమ్మకండి
## నా ఆరోగ్యం బాగానే ఉంది..!



సోషల్ మీడియాలో కొన్నిసార్లు అసత్య ప్రచారాలతో ఇబ్బంది పడిన సెలబ్రిటీలు, సినిమా వాళ్లు చాలామందే.
తమ గురించిన ఆ తప్పుడు వార్తల్ని వారు స్వయంగా ఖండించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. తాజాగా తమిళ చిత్రసీమలో సీనియర్ నటి వడివుక్కరాశి కూడా అదే పని చేశారు. తాను చనిపోయినట్టు ప్రచారమవుతున్న అసత్య వార్తలను ఆమె ఖండించారు. తాను ఆరోగ్యంగానే ఉన్నానని, వదంతులు నమ్మొద్దని ఆమె స్పష్టం చేశారు.
శ్రేయోభిలాషులు, అభిమానులు ఎవరూ కూడా తన గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.
తమిళంతో పాటు తెలుగులోనూ పలు చిత్రాల్లోనూ కీలక పాత్రలు పోషించిన వడివుక్కరాశి తన ఆరోగ్యంపై ప్రచారమవుతున్న అసత్య వార్తలను ఖండించారు.
తాను చనిపోయినట్టు వస్తున్న ప్రచారాన్ని ఆమె కొట్టిపారేశారు. సోషల్ మీడియాలో వ్యాపిస్తున్న అబద్ధపు కథనాలకు అడ్డుకట్ట వేస్తూ.. నేను బతికే ఉన్నాను, బాగానే ఉన్నాను చెప్పారీ వెటరన్ నటి.
ఇటీవల వడివుక్కరాశి ఆరోగ్యం బాగాలేదని, ఆమె చనిపోయారని కొన్ని పోస్టులు వెలిశాయి. దాంతో.. అలాంటి అసత్య వార్తలకు చెక్ పెట్టేందుకు ఆమె మీడియా ముందుకొచ్చారు.
తంథి టీవీతో మాట్లాడిన వడివుక్కరాశి.. తన ఆరోగ్యంపై అపోహలు వద్దని, తాను బాగానే ఉన్నానని స్పష్టం చేశారు. 'సోషల్ మీడియాలో పేర్కొన్నట్టు తానేమీ అనారోగ్యంతో బాధ పడటం లేదని వడివుక్కరాశి తేల్చి చెప్పారు. అబద్ధపు వార్తలు చూసి..
తన గురించి వాకబు చేసిన శ్రేయాభిలాషులకు, అభిమానులకు ధన్యవాదాలు' అని పేర్కొన్నారు.

**ఐదు దశాబ్దాలుగా**

చిత్రసీమలో ఐదు దశాబ్దాలుగా కొనసాగుతున్నారు వడివుక్కరాశి. తమిళం, తెలుగు, మలయాళంతో పాటు.. కన్నడలోనూ ఆమెపలు పాత్రలు పోషించారు. ఇప్పటివరకూ 350కి పైగా సినిమాల్లో, 40కి పైగా టీవీ సీరియళ్లలో నటించారు. సినిమాల్లోకి రాకముందు తను టీచర్‌గా ఉద్యోగం చేసేవారు.
కమల్ హాసన్ 'సిగప్పు రొజాక్కల్' చిత్రంతో వెండితెర అరంగేట్రం చేశారీ వెటరన్. చివరగా తను అర్జున్ దాస్ నటించిన 'కాన్ సిటీ'లో డబ్బుల కోసం అనారోగ్యంతో బాధ పడే తల్లి పాత్రలో మెప్పించారు

## అండాశయ క్యాన్సర్ వంశపారంపర్యంగా వస్తుందా
## ఎలాంటి లక్షణాలు కనిపిస్తాయి..?

అండాశయ క్యాన్సర్‌ను చాలాసార్లు స్పష్టమైన లక్షణాలు కనిపించని వ్యాధిగా పరిగణిస్తారు. కడుపు ఉబ్బరం, పొత్తికడుపులో అసౌకర్యం, ఆకలిలో మార్పులు వంటి లక్షణాలను చాలామంది సాధారణ సమస్యలుగా భావిస్తారు. అయితే కొన్ని సందర్భాల్లో క్యాన్సర్‌కు తొలి ముఖ్యమైన సంకేతం లక్షణం కాకుండా కుటుంబంలో ఉన్న క్యాన్సర్ చరిత్ర అవుతుంది. ఎక్కువ శాతం అండాశయ క్యాన్సర్ కేసులు వంశపారంపర్యంగా రావు. అయితే సుమారు 25 శాతం కేసులు వంశపారంపర్య క్యాన్సర్ సంబంధిత పరిస్థితులతో ముడిపడి ఉంటాయని సమాచారం. ముఖ్యంగా బీఆర్‌సీఏ1, బీఆర్‌సీఏ2 జన్యువుల్లో మార్పులు ఇందుకు ప్రధాన కారణాల్లో ఒకటి. రొమ్ము లేదా అండాశయ క్యాన్సర్ కుటుంబ చరిత్ర ఉన్న అధిక ప్రమాదం కలిగిన భారతీయుల్లో ఈ జన్యు మార్పులు సుమారు 24 నుంచి 28 శాతం వరకు కనిపించినట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. సాధారణ మహిళల్లో జీవితకాలంలో అండాశయ క్యాన్సర్ వచ్చే ప్రమాదం 2 శాతం కంటే తక్కువగా ఉండగా, బీఆర్‌సీఏ1 జన్యు మార్పు ఉన్నవారిలో అది 26-54 శాతానికి, బీఆర్‌సీఏ2 ఉన్నవారిలో 10-23 శాతానికి పెరుగుతుందని ఓ



అధ్యయనం తెలిపింది.

**తండ్రి వైపు కూడా చూడాలి..**

కుటుంబంలో ఇలాంటి క్యాన్సర్ చరిత్ర ఉంటే తల్లి వైపు మాత్రమే కాకుండా తండ్రి వైపు బంధువుల వివరాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. కుటుంబంలో పలువురికి రొమ్ము లేదా అండాశయ క్యాన్సర్ రావడం, 50 ఏళ్లలోపు వయసులో రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ కావడం, పురుష బంధువుకు రొమ్ము క్యాన్సర్ రావడం, ఒకే వ్యక్తికి రొమ్ము, అండాశయ క్యాన్సర్ రావడం లేదా రెండు రొమ్ముల్లో క్యాన్సర్ రావడం వంటి అంశాలను జన్యుపరమైన ప్రమాదాన్ని పరిశీలించాల్సిన సంకేతాలుగా భావిస్తారు. తల్లిదండ్రులు, తోబుట్టువులు, పిల్లలు, తాతలు, అమ్మమ్మలు, అత్తలు, మేనత్తలు, మామలు, పిన్ని, మేనకోడళ్లు, మేనల్లుళ్లలో ఎవరికైనా ఏ వయసులోనైనా అండాశయ క్యాన్సర్ వచ్చినట్లయితే వైద్యుడితో జన్యు సలహా గురించి మాట్లాడడం అవసరం.

**ఎలాంటి లక్షణాలు ఉంటాయి..**

అండాశయ క్యాన్సర్, ఫాలోపియన్ ట్యూబ్ క్యాన్సర్ లేదా ప్రాథమిక పెరిటోనియల్ క్యాన్సర్ ఉన్న ప్రతి ఒక్కరికీ వయసు, కుటుంబ చరిత్రతో సంబంధం లేకుండా జన్యు సలహా, జన్యు పరీక్షను పరిగణించాలని వైద్య మార్గదర్శకాలు సూచిస్తున్నాయి. అలాగే సాధారణ స్థితితో పోలిస్తే కొత్తగా ఏర్పడి తగ్గకుండా కొనసాగుతున్న కడుపు ఉబ్బరం, పొత్తికడుపు నొప్పి, తక్కువ ఆహారంతోనే కడుపు నిండిన భావన, తరచూ మూత్రం రావడం వంటి లక్షణాలు ఉంటే కుటుంబ చరిత్ర లేకపోయినా వైద్యులను సంప్రదించాలి. 2014కు ముందు జన్యు పరీక్ష చేయించుకున్న మహిళలు కూడా మరోసారి పరీక్ష అవసరమా అనే విషయాన్ని వైద్యులతో చర్చించవచ్చు. ఎందుకంటే అప్పటి నుంచి జన్యు పరీక్షల్లో బీఆర్‌సీఏ1, బీఆర్‌సీఏ2 తో పాటు మరిన్ని జన్యువులను గుర్తించే అవకాశం పెరిగింది.

**క్యాన్సర్ చరిత్రను పరిశీలించాలి..**

జన్యు సలహా అంటే కేవలం రక్త పరీక్ష చేయించుకోవడం మాత్రమే కాదు. కుటుంబంలోని క్యాన్సర్ చరిత్రను వివరంగా పరిశీలించడం, వంశపారంపర్య ప్రమాదాన్ని అర్థం చేసుకోవడం, పరీక్ష ఫలితం సానుకూలంగా లేదా ప్రతికూలంగా వస్తే దాని ప్రభావం వ్యక్తిపైనే కాకుండా తోబుట్టువులు, పిల్లలు, ఇతర కుటుంబ సభ్యులపై ఎలా ఉంటుందో తెలుసుకోవడం ఇందులో భాగం. జన్యు మార్పు ఉన్నట్లు తేలితే మరింత జాగ్రత్తగా పర్యవేక్షించడం, ప్రమాదాన్ని తగ్గించే శస్త్రచికిత్స వంటి మార్గాలను వైద్యులు సూచిస్తారు. ఇప్పటికే క్యాన్సర్ వచ్చిన సందర్భాల్లో కొన్ని లక్షిత చికిత్సలు కూడా అందుబాటులో ఉన్నాయి. కుటుంబంలో క్యాన్సర్ చరిత్ర ఉండడం అంటే క్యాన్సర్ తప్పనిసరిగా వస్తుందని అర్థం కాదు. అయితే అది ప్రమాదాన్ని అంచనా వేసేందుకు ఒక ముఖ్యమైన సంకేతం. అందుకే భయపడకుండా కుటుంబ చరిత్రను వైద్యుడితో పంచుకోవడం, అవసరమైతే జన్యు సలహా తీసుకోవడం ద్వారా వంశపారంపర్య ప్రమాదాన్ని ముందుగానే గుర్తించే అవకాశం ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు

# భారత్ వెస్టిండీస్ పోరుకు రెడీ.. ఫ్రీగా ఎక్కడ చూడాలంటే..?



ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన మూడు టీ20ల సిరీస్‌ను టీమ్ ఇండియా 3-0 తేడాతో క్లైవసం చేసుకుంది. ఇప్పుడు స్వదేశంలో వెస్టిండీస్‌తో పరిమిత ఓవర్ల సిరీస్‌కు సిద్ధమవుతోంది. ఈ నెల 27 నుంచి అక్టోబర్ 17 మధ్య భారత్ మూడు వన్డేలు, ఐదు టీ20 మ్యాచ్‌ల సిరీస్‌ను ఆడనుంది. భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఈ సిరీస్‌కు సంబంధించిన వన్డే, టీ20 జట్లను ఇప్పటికే ప్రకటించింది. వెస్టిండీస్‌తో జరిగే మూడు వన్డేల సిరీస్‌లో తొలి వన్డే ఈ నెల 27న త్రివేండ్రం వేదికగా జరగనుంది. రెండో వన్డే 30వ తేదీన గుహటిలో, చివరిదైన మూడో వన్డే చండీగఢ్‌లో జరగనుంది. ఈ వన్డే మ్యాచ్‌లన్నీ భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమవుతాయి. ఎక్కువమంది చదివినది: ఎఘుఎ ×అఃఙఖు: అందరికీ న్యాయం చేశారు.. కానీ, ఆ ఒక్కడినే ఎందుకు బలి చేశారు గంభీర్ జీ..!టీమిండియాపై హీరో.. మిగతా జట్లపై జీరో.. 6 ఇన్నింగ్స్‌ల్లో బౌల్ట్‌ఆ తర్వాత, టీ20 సిరీస్ అక్టోబర్ 6వ తేదీ నుంచి ప్రారంభమవుతుంది. తొలి టీ20 మ్యాచ్ లక్నో వేదికగా అక్టోబర్ 6న, రెండో టీ20 అక్టోబర్ 9న రాంచీలో, మూడో టీ20 అక్టోబర్ 11న ఇండోర్‌లో, నాలుగో టీ20 అక్టోబర్ 14న హైదరాబాద్‌లో, చివరిదైన ఐదో టీ20 అక్టోబర్ 17న బెంగళూరులో జరగనుంది. ఈ టీ20 మ్యాచ్‌లన్నీ రాత్రి 7:00 గంటలకు మొదలవుతాయి. ఈ మ్యాచ్‌లను టీవీలో స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో, ఓటీటీలో జియో హాట్‌స్టార్‌లో వీక్షించవచ్చు.

# ఆయన 12వేల పరుగులు చేసిన తోపేమో.. నా ముందు మాత్రం ఓ బచ్చా.. ఏకంగా 16 సార్లు షాకిచ్చా..



సౌతాఫ్రికాతరపున సుదీర్ఘకాలం పాటు అద్భుతమైన ప్రదర్శన కనబరిచిన పేస్ దిగ్గజం డేల్ స్టెయిన్ అంతర్జాతీయ క్రికెట్‌లో సుమారు ఏడు వందల వికెట్లను సాధించి అగ్రశ్రేణి బౌలర్‌గా నిలిచాడు. తన 15 ఏళ్ల ప్రయాణంలో ఎంతోమంది దిగ్గజ బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టిన ఈ స్పీడ్ గన్, రిటైర్మెంట్ తరువాత ఒక ఇంటర్వ్యూలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. మాజీ సహచర ఆటగాడు వెర్నాన్ ఫిలాండర్ తో మాట్లాడిన సందర్భంగా, ప్రస్తుత వయసులో కూడా తాను మళ్లీ బౌలింగ్ చేయడానికి ఇష్టపడే ఒక్కే ఒక్క బ్యాటర్ ఎవరనే ప్రశ్నకు ఆయన పాక్ మాజీ కెప్టెన్ మహ్మద్ హఫీజ్ పేరును బదులిచ్చాడు.క్రికెట్ ప్రపంచంలో హఫజ్ వర్సెస్ స్టెయిన్ పోరు ఒకానొక దశలో అత్యంత ఏకపక్షంగా సాగిందని చెప్పవచ్చు. డేల్ స్టెయిన్ బౌలింగ్‌లో హఫీజ్ అనేకసార్లు ఇబ్బంది పడుతూ తక్కువ పరుగులకే వెనుదిరిగాడు. 2013లో జరిగిన సౌతాఫ్రికా పర్యటనలోనూ హఫీజ్ వికెట్ పడినప్పుడు స్టెయిన్ మైదానంలో నవ్వుతూ కనిపించిన దృశ్యాలు అప్పట్లో చర్చనీయాంశమయ్యాయి. స్టెయిన్ వేసిన ప్రమాదకరమైన డెలివరీలను ఎదుర్కోవడంలో హఫీజ్ తీవ్రంగా తంటాలు పడ్డారు. గణాంకాల ప్రకారం అన్ని ఫార్మాట్లలో కలిపి హఫీజ్‌ను స్టెయిన్ 15 సార్లు ఔట్ చేయడం గమనార్హం. ఇందులో ఒక్క టెస్టు క్రికెట్‌లోనే 8సార్లు ఆయనను బోల్తా కొట్టించాడు.టీమిండియాపై హీరో.. మిగతా జట్లపై జీరో.. 6 ఇన్నింగ్స్‌ల్లో బౌల్విపరీతమైన ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ మహ్మద్ హఫీజ్ పాకిస్థాన్ క్రికెట్ చరిత్రలో అత్యుత్తమ ఆల్ రౌండర్లలో ఒకరిగా గుర్తింపు పొందాడు. 2007 ప్రారంభ టీ20 ప్రపంచకప్ ఫైనల్ చేరిన జట్టులో ఆయన కీలక సభ్యుడిగా ఉన్నాడు. అలాగే 2017లో ఇంగ్లండ్‌లో జరిగిన ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీని గెలుచుకున్న పాక్ జట్టులోనూ తన వంతు పాత్ర పోషించాడు. టెస్టులు, వన్డేలు, టీ20లు అన్ని ఫార్మాట్లలో కలిపి ఆయన పన్నెండు వేలకు పైగా

# జియో హాట్‌స్టార్, సోనీ లివ్‌లో రాదు



భారత్ అలాగే ఆఫ్ఘనిస్తాన్ జట్ల మధ్య జరుగుతున్న టీ20 సిరీస్ ఉత్కంఠభరితంగా సాగుతోంది. మొదటి మ్యాచ్ ముగిసిన తర్వాత ఇప్పుడు అందరి దృష్టి రెండో టీ20 పోరుపై నిలిచింది. ఈ మ్యాచ్‌ను ఇంట్లో కూర్చుని లైవ్‌లో చూడాలని భావించే అభిమానులకు ఎలాంటి ప్లాట్‌ఫారమ్‌ను ఆశ్రయించాలనే దానిపై స్పష్టత లేదు. ఎందుకంటే ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫారమ్‌లలో ఈ మ్యాచ్ ప్రసారం కావడం లేదు.

మ్యాచ్ వేదిక అలాగే సమయం

భారత్ -- ఆఫ్ఘనిస్తాన్ జట్ల మధ్య రెండో టీ20 పోరు నేడు అంటే సెప్టెంబర్ 15 తేదీన రాజధాని ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జరగనుంది. భారత కాలమానం ప్రకారం సాయంత్రం 7.30గంటలకు మ్యాచ్ ప్రారంభమవుతుంది. సరిగ్గా సాయంత్రం 7 గంటలకు టాస్ వేస్తారు. ఈ సిరీస్‌లోని అన్ని మ్యాచ్‌లు ఢిల్లీ మైదానంలోనే జరగడం విశేషం.లైవ్ స్ట్రీమింగ్ ఎందులో వస్తుంది?ఈ మ్యాచ్‌ను వీక్షించడానికి ప్రయత్నించే క్రీడాభిమానులకు ప్రముఖ యాప్‌లైన జియో హాట్‌స్టార్ లేదా సోనీ లివ్‌లలో స్ట్రీమింగ్ లభించదు. దీనికి బదులుగా ఫ్యాన్ కోడ్ ప్లాట్‌ఫారమ్‌లో మ్యాచ్ ప్రత్యక్ష ప్రసారం కానుంది. మొబైల్, ల్యాప్‌టాప్ అలాగే ఇతర డిజిటల్ పరికరాల్లో మ్యాచ్ చూడాలనుకునే ప్రేక్షకులు ఫ్యాన్ కోడ్ యాప్ లేదా వెబ్‌సైట్‌ను ఉపయోగించుకోవచ్చు.టీవీలో ఏ ఛానెల్‌లో చూడవచ్చు?టెలివిజన్‌లో మ్యాచ్ చూడాలనుకునే వారి కోసం సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్ ఏర్పాట్లు చేసింది. సోనీ స్పోర్ట్స్ టెన్ 5 హెచ్‌డీ అలాగే సోనీ స్పోర్ట్స్ టెన్ ఐదు ఎస్డీ ఛానెళ్ల ద్వారా టీవీ ప్రేక్షకులకు లైవ్ టెలికాస్ట్ అందుబాటులో ఉంటుంది. పెద్ద స్క్రీన్‌పై మ్యాచ్ ఆస్వాదించాలనుకునే వారు ఈ ఛానెళ్లను ఎంచుకోవచ్చు.సిరీస్ క్లైవసం చేసుకునే అవకాశంతొలి టీ20 మ్యాచ్‌లో ఆఫ్ఘనిస్తాన్ జట్టుపై ఘన విజయం సాధించిన భారత్ మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో ఉంది. ఇప్పుడు జరగబోయే రెండో మ్యాచ్‌లో కూడా గెలిచి సిరీస్‌ను క్లైవసం చేసుకోవాలని అయ్యర్ సేన పట్టుదలగా ఉంది. మరోవైపు ఆఫ్ఘనిస్తాన్ జట్టు ఈ మ్యాచ్‌లో పుంజుకుని సిరీస్‌ను సమం చేయాలని చూస్తోంది.

# పసిడి ప్రియులకు షాక్.. మళ్లీ ఆకాశాన్ని తాకుతున్న ధరలు..!



. ధరలు ఒక్కసారిగా పతనం

గోల్డ్ ప్రియులకు ఊరట కలిగింది. ధరలు మరోసారి డౌన్ అవుతున్నాయి. గత మూడు వారాలుగా పసిడి దిగొస్తోంది. పెళ్లిళ్ల సీజన్ కావడం, త్వరలో వినాయక చవితి, దసరా పండగలు రానున్న క్రమంలో గోల్డ్ రేట్లు పతనమమవుతుండటం కొనుగోలు చేయాలనుకునేవారికి ఉపశమనం కల్గిస్తోంది. డాలర్ విలువ బలపడటం, అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చితి, ద్రవ్యోల్బణం భయాల క్రమంలో ధరలు క్రాష్ అవుతున్నాయి. అయితే ఈ ధరల పతనం అనేది ఎన్ని రోజులు ఉంటుందని ఎవరూ అంచనా వేయలేమని మార్కెట్ అనలిస్టులు విశ్లేషిస్తున్నారు. యూఎస్ ఫెడ్ రిజర్వ్ బ్యాంక్ వడ్డీ రేట్ల అంచనాలపై స్పష్టత రావడం లేదు. దీంతో బంగారం ధరల్లో ఎప్పుడైనా మార్పులు జరగొచ్చని అనలిస్టులు చెబుతున్నారు. అంతర్జాతీయంగా బంగారం ధరలు క్రాష్ అవ్వడంతో.. దేశీయంగా కూడా కుప్పవిశ్లేషిస్తున్నారు. యూఎస్ ఫెడ్ రిజర్వ్ బ్యాంక్ వడ్డీ రేట్ల అంచనాలపై కూలాయి. సెప్టెంబర్ 10వ తేదీన దేశంలోని వివిధ ప్రధాన నగరాల్లో ధరలు ఎలా ఉన్నాయనేది ఇప్పుడు చూద్దాం.బంగారం ధరలు ఇవే..

-దేశీయ బులియన్ మార్కెట్లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,54,300 వద్ద కొనసాగుతోండగా.. 22 క్యారెట్ల రేటు రూ.1,41,440గా ఉంది.-హైదరాబాద్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల స్వచ్ఛమైన మేలిమి బంగారం ధర రూ.1,54,300గా ఉండగా.. 22 క్యారెట్లు చూస్తే రూ.1,41,440 వద్ద ట్రేడవుతోంది.-చెన్నైలో 24 క్యారెట్ల ధర రూ.1,54,300, 22 క్యారెట్ల రేటు రూ.1,41,440గా కొనసాగుతోంది.-దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం ధర రూ.1,54,450 వద్ద కొనసాగుతోండగా.. 22 క్యారెట్ల రేటు రూ.1,41,590గా ఉంది-బెంగళూరులో 24 క్యారెట్ల బంగారం ధర రూ.రూ.1,54,300 వద్ద కొనసాగుతుడగా.. 22 క్యారెట్ల రేటు రూ.1,41,440 పలుకుతున్నాయి.వెండి రేట్లు ఇవే..వెండి ధరలు కూడా పతనమయ్యాయి. గత కొద్ది రోజులుగా స్థిరంగా కొనసాగుతున్న ధరలు.. గురువారం స్వల్పంగా తగ్గుముఖం పట్టావిశ్లేషిస్తున్నారు. యూఎస్ ఫెడ్ రిజర్వ్ బ్యాంక్ వడ్డీ రేట్ల అంచనాలపై యి. బెంగళూరులో కేజీ వెండి ధర రూ.2,49,900 వద్ద కొనసాగుతోండగా.. నిన్న రూ.2.50 లక్షలుగా ఉంది.-హైదరాబాద్‌లో కిలో వెండి ధర రూ.2,54,900 వద్ద ఉండగా.. నిన్న రూ.2.55 లక్షలు పలికాయి-చెన్నైలో కిలో సిల్వర్ ధర రూ.2,54,900 వద్ద ట్రేడవుతోంది.-ఢిల్లీలో కేజీ వెండి రూ.2,49,900గా ప్రస్తుతం ఉండగా.. బుధవారం రూ.2.50 లక్షల వద్ద స్థిరపడింది

# రతన్ టాటా మరణం తర్వాత టాటా గ్రూప్‌లో ఈ సమస్యలు ఎందుకు వచ్చాయి?



దేశంలోని అత్యంత ప్రతిష్టాత్మక వ్యాపార సముదాయాలలో ఒకటైన టాటా గ్రూప్, నాయకత్వం, కార్పొరేట్ పాలన, టాటా సన్స్ భవిష్యత్తుకు సంబంధించి సవాళ్లను ఎదుర్కొంటోంది. దాని మాజీ ఛైర్మన్ రతన్ టాటా మరణం తర్వాత ఈ గ్రూప్ నిరంతరం వార్తల్లో నిలుస్తోంది. అయితే దీనికి కారణం వ్యాపార సంక్షోభం లేదా పెద్ద వ్యాపార మార్పు కాదు. అసలు సమస్య కార్పొరేట్ పాలన, గ్రూప్‌పై నియంత్రణ. అక్టోబర్ 9, 2024న రతన్ టాటా మరణం తరువాత, టాటా ట్రస్ట్‌ల పగ్గాలు నోయెల్ టాటా చేతికి వెళ్లడంతో, నియంత్రణ అధికారంపై బోర్డులో పోరాటం మొదలైంది.రతన్ టాటా తర్వాత టాటా గ్రూప్‌లో ఏమి మార్పు వచ్చింది?

రతన్ టాటా మరణం తర్వాత, టాటా గ్రూప్‌లో అనేక పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఇవి గ్రూప్ నాయకత్వంపైనా, టాటా ట్రస్ట్, టాటా సన్స్ మధ్య ఉన్న సంబంధంపైనా ప్రశ్నలను లేవనెత్తాయి. ఇప్పుడు ప్రశ్న ఏమిటంటే.. రతన్ టాటా నిష్క్రమణ తర్వాత టాటా గ్రూప్‌లో ఏమి మారింది? దీనికి సమాధానం బహుశా ఏ ఫ్యాక్టరీలోనో, కారులోనో, లేదా స్టీల్ ప్లాంట్‌లోనో కాకుండా, ముంబైకి చెందిన టాటా సన్స్ అనే కంపెనీ బోర్డు రూమ్‌లో ఉండవచ్చు. ఈ కంపెనీ టాటా గ్రూప్‌లోని అతిపెద్ద కంపెనీలను నియంత్రిస్తున్నప్పటికీ, నేడు దాని భవిష్యత్తు గురించే అత్యధిక ప్రశ్నలు తలెత్తుతున్నాయి.నిర్ణయాధికారంరతన్ టాటా హయాంలో టాటా గ్రూప్ అతిపెద్ద బలం దాని ఐక్యతేనని నిపుణులు భావిస్తున్నారు. ఆయన మరణం టాటా పేరుపై తుది నిర్ణయం ఎవరిది అనే ప్రశ్నను మొదటిసారిగా బహిరంగంగా లేవనెత్తింది. నిజానికి రతన్ టాటా హయాంలో నాయకత్వం అంతిమ నైతిక, సంస్థాగత అధికారం చాలావరకు స్పష్టంగా ఉండేది. ఆయన మరణం ఇప్పుడు టాటా గ్రూప్ తుది దిశను ఎవరు నిర్ణయిస్తారు? అనే ప్రశ్నను లేవనెత్తింది.రతన్ టాటా మరం తర్వాత..

రతన్ టాటా మరణం, హోల్డింగ్ కంపెనీలో సుమారు 66% వాటాను కలిగి ఉన్న ధార్మిక ట్రస్టులకు, టాటా సన్స్‌కు మధ్య ఉన్న కీలకమైన సంబంధాన్ని తెంచేసింది. ఆయన మరణంతో టాటా ట్రస్ట్ నాయకత్వ మార్పు సవాలును ఎదుర్కోగా, టాటా సన్స్ చంద్రశేఖరన్ పర్యవేక్షణలో తన కార్యకలాపాలను కొనసాగించింది. రెండు రోజుల తర్వాత రతన్ టాటా సవతి సోదరుడైన నోయల్ టాటా టాటా ట్రస్ట్ ఛైర్మన్‌గా నియమితులయ్యారు. ఈ మార్పు సజావుగా సాగుతున్నట్లు కనిపించినప్పటికీ, అప్పటికే ఒక ముఖ్యమైన అడ్డంకి ఎదురైంది. టాటా సన్స్ నిబంధనలలో మార్పు కారణంగా, టాటా ట్రస్ట్ ఛైర్మన్ ఏకకాలంలో టాటా సన్స్ ఛైర్మన్‌గా కొనసాగలేకపోయారు. అందువల్ల, నోయెల్ టాటా సన్స్‌కు డైరెక్టర్‌గా మారగా, చంద్రశే ఖరన్ హోల్డింగ్ కంపెనీ అధిపతిగా కొనసాగారు. 2024 చివరిలో లిస్టింగ్ ఒత్తిడి: నాయకత్వ మార్పుతో పాటు, టాటా సన్స్ ఎదుర్కొంటున్న మరో సమస్య అది లిస్టెడ్ కాని కంపెనీగా ఉండటం. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (=దీ×) టాటా సన్స్‌ను “అగ్రశ్రేణి నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ” (చీదీఖీజ)గా వర్గీకరించింది. ఆర్‌బిఐ నిబంధనల ప్రకారం, అటువంటి కంపెనీలు వర్గీకరణ జరిగిన మూడు సంవత్సరాలలోపు స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ కావాల్సి ఉండగా, టాటా సన్స్‌కు సెప్టెంబర్ 2025ను గడువుగా నిర్ణయించారు. టాటా సన్స్ పబ్లిక్‌గా వెళ్లడానికి ఇష్టపడలేదు. లిస్టింగ్ నిబంధన నుండి వి కోరింది. కానీ ఆర్‌బిఐ ఇంకా అలాంటి మినహాయింపు

# గ్యాస్ సిలిండర్ వినియోగదారులకు బిగ్ అప్‌డేట్..

ఈ పని చేయకపోతే సబ్సిడీ కట్!

న్యూఢిల్లీ: వంటగ్యాస్ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం కీలక అప్‌డేట్ ఇచ్చింది. సబ్సిడీతో కూడిన గృహ వినియోగ ూ+ రీఫిల్‌లకు అక్టోబర్ 1, 2026 నుంచి బయోమెట్రిక్ ఆధార్ ధృవీకరణ తప్పనిసరి కానుంది. సబ్సిడీ ప్రయోజనం సరైన కుటుంబాలకు మాత్రమే చేరేలా చూడటంతో పాటు, నకిలీ, డూప్లికేట్, అనర్హమైన కనెక్షన్లను తొలగించడం ఈ చర్య ప్రధాన ఉద్దేశ్యమని పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ వెల్లడించింది.ఇప్పటికే 89.9 శాతం మంది పూరిమంత్రిత్వ శాఖ తాజా సమాచారం ప్రకారం సెప్టెంబర్ 19 నాటికి 27.43 కోట్ల క్రియాశీల దేశీయ ూ+ వినియోగదారులు, అంటే మొత్తం వినియోగదారుల్లో 89.9 శాతం మంది బయోమెట్రిక్ ఆధార్ ధృవీకరణ పూర్తి చేశారు. ఇప్పటికే వెరిఫికేషన్ పూర్తి చేసిన వినియోగదారులు మళ్లీ ఎలాంటి ప్రక్రియ చేపట్టాల్సిన అవసరం లేదు. ఇంకా ధృవీకరణ పూర్తి చేయని వినియోగదారులు అక్టోబర్ 1 నుంచి సబ్సిడీ ధరకు రీఫిల్ బుక్ చేసుకునే ముందు బయోమెట్రిక్ ఆధార్ ప్రామాణీకరణ పూర్తి చేయాల్సి ఉంటుంది. ధృవీకరణ పూర్తయిన తర్వాత సబ్సిడీ రీఫిల్ బుకింగ్‌కు అర్హత లభిస్తుంది.ఎక్కడ వెరిఫికేషన్ చేసుకోవచ్చు?వినియోగదారులకు ప్రభుత్వం పలు మార్గాలను అందుబాటులో ఉంచింది. ూ+ సిలిండర్ డెలివరీ సమయంలోనే డెలివరీ సిబ్బంది ద్వారా బయోమెట్రిక్ ఆధార్




ధృవీకరణ చేయించుకోవచ్చు. అలాగే సంబంధిత ూ+ డిస్ట్రిబ్యూటర్ షోరూమ్‌కు వెళ్లి కూడా పూర్తి చేయవచ్చు. ఇక ఇంటి నుంచే మొబైల్ యాప్ ద్వారా కూడా ఈ ప్రక్రియను పూర్తి చేసే అవకాశం ఉంది. ఇండేన్‌కు ×అఇఖుఅఆశ్రీ ూచీజు, భారత్‌గ్యాస్‌కు ఎవశ్రీశ్రీశీదీూజూ, పూ గ్యాస్‌కు పూ ూో యాప్‌లను ఉపయోగించవచ్చు. ూ+ బయోమెట్రిక్ ధృవీకరణకు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు.వెరిఫికేషన్ చేయకపోతే ఏమవుతుంది?బయోమెట్రిక్ ఆధార్ ధృవీకరణ పూర్తి చేయకూడదనుకునే లేదా చేయలేని వినియోగదారులు ూ+ పొందడం మాత్రం కొనసాగించవచ్చు. అయితే వారికి సబ్సిడీ ధర వర్తించదు. వారు మార్కెట్ ధరకు ూ+ రీఫిల్ పొందాల్సి ఉంటుంది. అలాంటి వినియోగదారులు తమకు కావాల్సిన సిలిండర్ ఎంపికను ూవీజల వెబ్‌సైట్లు, మొబైల్ యాప్‌లు, వాట్సాప్ చాట్‌బాట్‌లు లేదా ×ఎ=ూ ద్వారా తెలియజేయాల్సి ఉంటుంది. స్థానికంగా అందుబాటులో ఉన్న మేరకు 5 కేజీలు లేదా 10 కేజీల సిలిండర్లను ఎంచుకునే అవకాశం ఉంటుంది.ఎందుకు ఈ కొత్త నిబంధన?

సబ్సిడీతో అందించే గృహ ూ+ ఇతర అవసరాలకు మళ్లకుండా చూడటం, నకిలీ కనెక్షన్లను తొలగించడం, నిజమైన లబ్ధిదారులను గుర్తించడం ఈ కార్యక్రమం లక్ష్యాలుగా ప్రభుత్వం చెబుతోంది. గతంలో కూడా ఆధార్ ఆధారిత ధృవీకరణ, డూప్లికేట్ కనెక్షన్ల తొలగింపు వంటి చర్యలు చేపట్టినట్లు ప్రభుత్వం వెల్లడించింది. 2023 అక్టోబర్ నుంచే దేశవ్యాప్తంగా బయోమెట్రిక్ ఆధార్ ధృవీకరణ కార్యక్రమం కొనసాగుతోంది. వినియోగదారులకు అవగాహన కల్పించేందుకు ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ూమీూ, వాట్సాప్ సందేశాలు, డిస్ట్రిబ్యూటర్లు, డెలివరీ సిబ్బంది, ప్రత్యేక శిబిరాలు, ×ఎ=ూ వంటి పలు మార్గాలను ఉపయోగిస్తున్నాయి.

సబ్సిడీ కోసం వినియోగదారులు ఏం చేయాలి?

అక్టోబర్ 1 నుంచి సబ్సిడీ ధరకు ూ+ రీఫిల్ కావాలనుకునే అర్హులైన వినియోగదారులు ఇప్పటికే బయోమెట్రిక్ ఆధార్ వెరిఫికేషన్ పూర్తయిందో లేదో ముందుగానే నిర్ధారించుకోవడం మంచిది. పూర్తికాకపోతే డెలివరీ సమయంలో, డిస్ట్రిబ్యూటర్ వద్ద లేదా సంబంధిత ూవీజ యాప్ ద్వారా ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చు. ూ+ సంబంధిత సహాయం లేదా సందేహాల కోసం ప్రభుత్వం 1800 2333 555 టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్‌ను

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం





సాధారణంగా భారీ బడ్జెట్‌లతో తీసిన సినిమాలు తరచుగా బాక్సాఫీస్ వద్ద విఫలమవుతాయి. దీనికి ఉదాహరణ ఇటీవల విడుదలైన 'టాక్సిక్' సినిమా తీవ్ర నిరాశ పరిచిన సంగతి తెలిసిందే. సుమారు రూ. 500 కోట్ల బడ్జెట్‌తో నిర్మించిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఘోరంగా విఫలమైంది. రాకింగ్ స్టార్ యష్ హీరోగా నటించిన ఈ మూవీ నిరాశపరిచింది. ఆకట్టుకునే కథాంశాలున్న తక్కువ బడ్జెట్ చిత్రాలు ప్రజాదరణ పొందుతున్నాయి. అయితే ఇప్పుడు మనం మాట్లాడుకుంటున్న ఓ హీరోయిన్ సౌత్ ఇండస్ట్రీలో సంచలనం సృష్టిస్తుంది. 5 చిత్రాలలో నటించి, రూ. 1000 కోట్లు వసూలు చేసిన నటి గురించి మీకు తెలుసా? ఆమె మరెవరో కాదు మమితా బైజు. ఆమె ప్రస్తుతం వరుస అవకాశాలు అందుకుంటున్నాయి. ఆమె నటించిన విడుదలైన చిత్రాలు అభిమానుల నుండి మంచి స్పందనను అందుకుంటున్నాయిమమితా బైజు 2017లో విడుదలైన 'సర్వోపరి బాలక్కరన్' చిత్రంతో సినీ పరిశ్రమలో నటిగా అరంగేట్రం చేశారు. ఆమె మలయాళంలో అనేక చిత్రాలలో నటించినప్పటికీ, 'ప్రేమలు' చిత్రమే ఆమెకు మలయాళం దాటి ఇతర భాషలలోనూ మంచి పేరు తెచ్చిపెట్టింది. 'రెబెల్' సినిమా మమితకు తమిళ చిత్రసీమలో ప్రవేశం కల్పించినప్పటికీ, 'డ్యూడ్' ఆమెకు అద్భుతమైన అరంగేట్రాన్ని అందించింది. ధనుష్ నటించిన 'కర' చిత్రంలో ఆమె అద్భుతంగా నటించింది. ఆ సినిమా తర్వాత, ఆమె విజయ్ నటించిన 'జననాయకన్' చిత్రంలో నటించింది. ఆ తర్వాత, మమిత బైజు 'విశ్వనాథ్ అండ్ సన్స్' , 'బెత్లెహెం కుటుంబ యూనిట్' చిత్రాలతో హ్యాట్రిక్ విజయాలను అందుకుంది. బాక్సాఫీస్ వసూళ్ల పరంగా, మమిత నటించిన 'ప్రేమలు' రూ. 130 కోట్లు సంపాదించింది. 'డ్యూడ్' రూ. 100 కోట్లకు పైగా వసూలు చేసింది. విజయ్ నటించిన 'జననాయకన్' రూ. 300 కోట్లు వసూలు చేసినట్లు సమాచారం. సూర్య నటించిన 'విశ్వనాథ్ అండ్ సన్స్' రూ. 260 కోట్లు వసూలు చేసినట్లు వార్తలు వచ్చాయి. నివిన్ పౌలీ నటించిన 'బెత్లెహెం కుటుంబ యూనిట్' రూ. 300 కోట్లు వసూలు చేసి మలయాళంలో రికార్డు సృష్టించింది.దీంతో మమితా బైజు వెయ్యి కోట్ల రూపాయలకు పైగా సంపాదించిన నటిగా గుర్తింపు పొందారు. ఆమె నటించిన చిత్రాలను అభిమానులు కనీస గ్యారెంటీగా ఆదరించారు. ఒక యువ నటిగా మమితా కేవలం మలయాళంలోనే కాకుండా తమిళంలో కూడా బిజీగా ఉండటం గమనార్హం.

# వరుసగా వెయ్యి కోట్ల కలెక్షన్స్..

# ఇంగ్లీష్ "రామాయణం"లో కీలక మార్పులు



భారతీయ సినీ చరిత్రలో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న అద్భుత దృశ్యకావ్యం 'రామాయణం' నుంచి తాజా అప్ డేట్ వచ్చేసింది. ఈ ఎపిక్ మూవీకి సంబంధించిన ప్రమోషన్స్ ఇప్పటికే సరికొత్త రికార్డులు సృష్టిస్తున్నాయి. సినిమా ట్రైలర్ సోషల్ మీడియాలో ఏకంగా 100 కోట్ల డిజిటల్ వ్యూస్ సాధించి ఆల్‌టైమ్ రికార్డులను బ్రేక్ చేసింది.అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'రామాయణం' సినిమాను భారతీయ ఇంకా అంతర్జాతీయ ప్రేక్షకుల కోసం ఒక భారీ దృశ్యకావ్యంగా తెరకెక్కిస్తున్నారు. అయితే, అన్ని మార్కెట్లలోనూ ఈ చిత్రం ఒకేలా ఉండదని తెలుస్తోంది. 'రామాయణం' ఇంగ్లీష్ వెర్షన్ నిడివి, హిందీ వెర్షన్‌తో పోలిస్తే దాదాపు 30 నిమిషాలు తక్కువగా ఉంటుంది. హిందీ వెర్షన్‌తో పోలిస్తే అంతర్జాతీయ వెర్షన్ నిడివి 30 నిమిషాలు తక్కువగా ఉండనుంది. అలాగే, గ్లోబల్ ఆడియెన్స్ కోసం 'రామాయణం'లో కీలక మార్పులు చేస్తున్నారు! గ్లోబల్ ప్రేక్షకులను దృష్టిలో ఉంచుకుని పాటలను పూర్తిగా తొలగించారు.అంతర్జాతీయ వెర్షన్ నిడివిని మరింత కుదించి, విదేశీ థియేటర్ ప్రేక్షకులకు తగినట్లుగా సినిమాలోని కొన్ని భాగాలను ట్రిమ్ చేయనున్నారు. దాంతో భారతీయ భాషల వెర్షన్ల కంటే పూర్తిగా భిన్నంగా ఉండనుంది. ప్రపంచ థియేటర్ ప్రేక్షకులకు మరింత దగ్గరైన ఫార్మాట్‌లో సినిమాను వారి ముందుకు తీసుకెళ్లాలని మేకర్స్ భావిస్తున్నారు. సినిమాను అంతర్జాతీయ మార్కెట్ల కోసం ప్రత్యేకంగా లోకలైజ్ చేస్తున్నారు. కేవలం సాధారణ డబ్బింగ్‌పై ఆధారపడకుండా, నటీనటుల హావభావాలు చెక్కుచెదరకుండా టెక్నాలజీని ఉపయోగించి ఇంగ్లీష్, స్పానిష్, జపనీస్ భాషల్లోకి అనువదిస్తున్నట్లు నిర్మాత నమిత్ మల్హోత్రా తెలిపారు. హిందీ సినిమాను కేవలం ఇంగ్లీషులోకి డబ్బింగ్ చేసి వదలకుండా, ప్రపంచ ఆడియెన్స్ కు తగినట్లుగా గ్లోబల్ వెర్షన్‌ను తీర్చిదిద్దుతున్నారు.అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న 'రామాయణం' చిత్రాన్ని రెండు భాగాలుగా విడుదల చేస్తున్నారు. మొదటి భాగం 2026 నవంబర్‌లో ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. రెండో భాగం 2027 దీపావళికి ప్రేక్షకుల ముందుకు



# వరంగల్ ఎయిర్ పోర్టుకు పేర్లు చెప్పిన సందీప్ రెడ్డి వంగా..

వరంగల్ లో అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటు చేయడం అనేది ఆ ప్రాంత వాసుల దశాబ్దాల కల. అయితే ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసే ఎయిర్ పోర్టుకు ఏ పేరు పెట్టాలనే అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజల నుంచి సోషల్ మీడియా వేదికగా పలు సూచనలు కోరారు. ఈ క్రమంలోనే తాజాగా తమ దశాబ్దల కల నెరవేరిన సందర్భంగా వరంగల్ ప్రాంతానికి చెందిన డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. తమ సొంత పట్టణానికి ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ రావడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. అయితే సీఎం రేవంత్ రెడ్డి సూచన మేరకు సందీప్ రెడ్డి రెండు పేర్లను సూచించారు. వరంగల్ ఎయిర్ పోర్ట్ కు రుద్రమ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ (=×ూూ), కాకతీయ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ (ఖ×ూూ) వంటి చారిత్రక పేర్లను సూచిస్తూ సందీప్ రెడ్డి వంగా వరుస ట్వీట్స్ చేశారు.ఆయన సూచనకు స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి 'దట్స్ ది స్పిరిట్..' అంటూ ఎక్స్(ట్విట్టర్) లో పోస్ట్ చేశారు. సీఎం స్పందన పట్ల సంతోషాన్ని తెలియజేస్తూ తను ఇండియాస్ బిగ్గెస్ట్ సూపర్ స్టార్ ప్రభాస్ హీరోగా రూపొందిస్తున్న "స్పిరిట్" సినిమాలో దట్స్ ది స్పిరిట్ అనే డైలాగ్ ను రాశానని, అదే మాట సీఎం రేవంత్ రెడ్డి గారి దగ్గర నుంచి రావడం ఆనందంగా ఉందని సందీప్ రెడ్డి వంగా పేర్కొన్నారు. సందీప్ రెడ్డి వంగా, సీఎం రేవంత్ రెడ్డి మధ్య సోషల్ మీడియా ద్వారా జరిగిన ఈ సంభాషణ నెటిజన్స్ దృష్టిని బాగా ఆకర్షిస్తోంది.

దీప్ రెడ్డి సినిమాల విషయానికి వస్తే.. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా రూపొందిస్తున్న లేటెస్ట్ మూవీ స్పిరిట్. భారీ అంచనాల మధ్య తెరకెక్కిస్తున్న ఈ మూవీలో త్రిప్తి డిమ్రీ కథానాయికగా నటిస్తుంది. ఇందులో ప్రభాస్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నారు. కొన్ని నెలలుగా ఈ మూవీ షూటింగ్ వేగంగా జరుగుతుంది.

# నాని పాత్రకు జడలు పెట్టడానికి కారణం అదే



న్యాచురల్ స్టార్ నాని పాన్ ఇండియా పీరియడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ది ప్యారడైజ్'. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో, ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మించారు. ఇప్పటికే విడుదలైన సాంగ్స్, గ్లింప్స్, టీజర్ అద్భుతమైన రెస్పాన్స్‌తో భారీ అంచనాలు పెంచాయి. ఈ చిత్రం సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు శ్రీకాంత్ ఓదెల విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.శ్రీకాంత్ గారు.. ఈ కథకు స్ఫూర్తి ఏమిటి?-ఈ కథకు నిజ జీవిత సంఘటన, కొన్ని పాత్రలు, అలాగే ఫిక్షన్.. ఈ మూడు ఉన్నాయి.-మా అమ్మగారు ఆడపిల్ల పుడితే బాగుంటుందని భావించారు. కానీ పుట్టలేదు. నాకే జడలు వేసి, గౌన్ వేసి పెంచారు. నా రెండో క్లాస్ వరకు నాకు జడలు ఉండేవి. జడలు అక్కడి నుంచి తీసుకున్నాను. దీని వెనుక కూడా చాలా ఎమోషన్ ఉంటుంది.-- ఇందులో ఉండే రెవల్యూషన్, ఆ పాత్రలను నేను పుట్టి పెరిగిన గోదావరిఖని ప్రాంతం నుంచి స్ఫూర్తి పొందినవి. ఆదిలాబాద్, గోదావరిఖని ప్రాంతాల మధ్యలో జరిగిన సంఘటనలు తీసుకున్నాను. నేను సికింద్రాబాద్ రైల్వే క్వార్టర్స్‌లో ఉన్నాను. ఆ పక్కన ఉండే బస్తీలో జరిగే కథలాగా డిజైన్ చేశాను. మా ఊర్లో నేను చూసిన సంఘటనలన్నీ మళ్లీ ఇక్కడ నాకు కనెక్ట్ అయ్యాయి.-'దసరా'ని ఒక మంచి డ్రామాగా చేయాలనేది నా ఉద్దేశం. కాకపోతే ప్రమోషనల్ కంటెంట్ చూసి అదొక 'కేజీఎఫ్'లా చాలా మాస్‌గా ఉంటుందని అనుకున్నారు. థియేటర్‌లోకి వెళ్లి చూసిన తర్వాత ప్యూర్ డ్రామా ఉంది. ఆ విషయంలో కొంచెం డిసప్పాయింట్ అయ్యారని నాకు ఫీడ్‌బ్యాక్ వచ్చింది. కాకపోతే రెండు రోజుల తర్వాత దానికి ట్యూన్ అయిపోయారు. సినిమా బ్లాక్‌బస్టర్ అయ్యింది. రికార్డ్స్ వచ్చాయి.-కాకపోతే అప్పుడు ఆడియన్స్ కోరుకునేది తీస్తే అది కమర్షియల్‌గా హై ఫీల్ అవుతారు కదా అని అనిపించి, అలా నాని గారి దగ్గరికి వెళ్లి ఈ ఆలోచన చెప్పాను. ఆడియన్స్ కోరుకునేది ఇవ్వాలని ఉద్దేశంతో ఇప్పుడు 'ప్యారడైజ్' తీసుకొస్తున్నాం.

# నేను ఓ ప్రేమ జంటకు దగ్గరుండి పెళ్లి చేశా



టాలీవుడ్ రాక్ స్టార్ మంచు మనోజ్ రీఎంట్రీలో వరుసగా సినిమాలు చేస్తున్నాడు. కేవలం హీరోగానే కాకుండా విలన్ గానూ మెప్పిస్తున్నాడు. ఇప్పటికే మనోజ్ విలన్ గా చేసిన మిరాయ్ బ్లాక్ బస్టర్ గా నిలిచింది. ఇప్పుడు నందమూరి బాలకృష్ణ హీరోగా నటిస్తోన్న దాదాలోనూ మనోజ్ ప్రతినాయకుడిగా కనిపించనున్నాడు. గోపీచంద్ మలినేని తెరకెక్కిస్తోన్న ఈ స్టైలిష్ యాక్షన్ థ్రిల్లర్ ఇప్పటికే చాలా భాగం షూటింగ్ పూర్తి చేసుకుంది .ఈ ఏడాది క్రిస్మస్ కానుకగా దాదా సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. కాగా తాజాగా యాంకర్ గానూ అవతారమెత్తాడు మనోజ్. కార్తీ హీరోగా నటించిన 'సర్దార్ 2' సినిమా సెప్టెంబర్ 10న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. తెలుగు ప్రమోషన్స్ లో టాలీవుడ్ హీరో మంచు మనోజ్ కూడా భాగమయ్యారు. ఇందులో భాగంగానే ఇటీవల కార్తీ, ఎస్.జె సూర్యలతో స్పెషల్ ఇంటర్వ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా సినిమా విషయాలతో పాటు తన పర్సనల్ లైఫ్ కు సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నాడు మనోజ్ . ఇదేక్రమంలో కార్తీ సోదరుడు సూర్యతో తనకున్న అనుబంధాన్ని మంచు మనోజ్ షేర్ చేసుకున్నారు.''నేను సూర్య అన్నని చిన్నప్పటి నుంచి చూస్తున్నాను. నేను 9వ తరగతి వరకూ చెన్నైలో చదువుకున్నా. పదో తరగతి నుంచి తిరుపతిలో చదివా. కాలేజ్

# ఆ హీరోయిన్ నాకు నటనలో పోటీగా ఉండేది.. ఆమెలో ఫైర్ ఉంటుంది.. హీరో శ్రీకాంత్



టాలీవుడ్ హీరో శ్రీకాంత్ మేక తన కెరీర్, వ్యక్తిగత జీవితం గురించి ఆసక్తికర విషయాలను వెల్లడించారు. ప్రేమకు నిర్వచనం అడిగినప్పుడు, ఆయన ఒకరికొకరు అండర్‌స్టాండింగ్, నమ్మకమే ముఖ్యమని చెప్పారు. తన భార్య ఊహతో ప్రేమ వివాహం గురించి మాట్లాడుతూ, ఆమె అందం, హీరోయిన్ హోదా, సంపద వంటి వాటికి ఆకర్షితుడిని కాలేదని స్పష్టం చేశారు. కట్నం లేదా ఆస్తుల గురించి తాను ఆలోచించలేదని, తన భార్య మెంటాలిటీ, సాఫ్ట్ నేచర్ నచ్చే తాను ఆమెను ప్రేమించానని అన్నారు. ఊహతో కలిసి నాలుగు సినిమాల్లో నటించడం వల్ల ఆమెను మరింత దగ్గరగా అర్థం చేసుకోగలిగానని తెలిపారు. శ్రీకాంత్ తన వంటల సరదాల గురించి కూడా ముచ్చటించారు. ఇంట్లో వంటగదిలోకి వెళ్లడం అరుదుగా ఉన్నప్పటికీ, స్నేహితులతో కలిసి కర్ణాటకలోని తన స్వస్థలం గంగావతిలో ఉన్న ఇంట్లో వంట కార్యక్రమాలు నిర్వహిస్తానని చెప్పారు. అప్పుడప్పుడు తన భార్య ఊహకు ఫోన్ చేసి పప్పుచారు, చికెన్ వంటి వంటకాల రెసిపీలు అడిగి చేసుకుంటానని వెల్లడించారు. వంటలో చేసిన ఒక విఫల ప్రయోగాన్ని గుర్తు చేసుకుంటూ, చికెన్‌లో వైన్ బదులు బకార్డీ రమ్ వేయడం వల్ల వంట పాడుచేసుకున్నానని నవ్వుతూ చెప్పారు. ఆ వంట కంపు కంపుగా మారి, ఇంటి నిండా ఆ వాసన వచ్చేసిందని, అదొక చేదు అనుభవమని పేర్కొన్నారు.తనకు ఇష్టమైన దర్శకుల గురించి మాట్లాడుతూ, కె. రాఘవేంద్ర రావు, ఈ.వి.వి., ఎస్.వి. కృష్ణారెడ్డి, కృష్ణవంశీ, విశ్వనాథ్ వంటి దిగ్గజ దర్శకుల పేర్లను ప్రస్తావించారు. వీరందరూ ఇష్టమే అయినా,

Printed, published &owned. By ravula rajesham printed at. JORDAR publication H.NO.2-5_146 . jammikunta.dist. karimnagar Telangana state 505122..editor.ravula rajesham, email. editor jordar@gmail.com. cellphone 7780185674 PRGi numberTG TEL/25/A5224